
# బాల



పిల్లల బొమ్మల పత్రిక

6




## పిల్లల బొమ్మల పత్రిక

సం॥ చందా రూ 5/- లు మాత్రమే.
విడిపత్రిక వెల ఆరుఅణాలు.
మాఏజంట్లు ప్రతిగ్రామములో వున్నారు.

## మిఠాయి సంచిక 1947

ఆగస్టు 5 తేదీని వస్తుంది. వెల 1 రూ.
చందాదారులకు ఉచితం.
(రిజిస్టరుపోస్టులో కావాలంటే 0-3-0 పంపాలి.)

## రచయితలు

'బాల' చక్కని ప్రత్యేకరచనలకు బహూకరిస్తుంది. రచనలు జూలై 15 తేదీలోపుగా మాకుఅందాలి.

## ఏజంట్లు

త్వరలో యడ్వాన్సు పంపుచూ ఎన్నికాపీలు కావాలో రాయండి. ఆలస్యం ఆశాభంగం.

## ప్రకటనలు

జూలై 15 తేదీ లోపుగా మాకుచేరాలి. వివరములకు వెంటనే రాయండి.


**ఆర్టుబోర్డు అట్టమీద అందాల భాల!**

**చిట్టిచిట్టి కథల చిన్నారి బాల**

నెం 3, తంబుచెట్టి వీధి, మదరాసు 1.

# మోటు, దాని నలుగురు స్నేహితులు-5


(వెనుకటి సంచిక తరువాయి)



చివరకు తాటి చెట్టు మీద గుడ్డల నార వేయుటకు, మోటు యూసఫ్‌కు సహాయము చేసెను. తరువాత ఆ బాలురకు చేయుటకు పని యేమియు లేనందున మోటూను అల్లరి పెట్టుచుండిరి.

మోటు దీనికి ప్రతిగా తనతొండమును నీటిలో ముంచి బాలురపై నీటిజల్లుకురిపించెను.

తరువాత ఏమైనది ?



దీనిని కత్తిరించి మీస్క్రాప్ పుస్తకములో నుంచుడు.





ది తాతా
ఆయిల్ మిల్సు
కం|| లి||



బాలలూ! ఈమె ఎవరో తెలుసా?

శ్రీ వెంకట్రామా పిక్చర్సు వారి



మహత్తరపౌరాణికచిత్రంలో అమాయికఅయిన ఆశ్రమనివాసి ఆత్రేయి.

# బ్రహ్మరథంలో చూడండి

పాటలూ మాటలూ, కవితాకళానిధి ★ నృత్యం వెంపటి ★ ఆర్టు టి. వి. యస్. శర్మ ★ సంగీతం మోతీబాబు

స్టూడియో : శోభనాచల

దర్శకుడు: చిత్రపు నారాయణమూర్తి బి. ఎ.

జయమ్మ, సరోజ, సౌదామిని, శ్రీరంజని, అనసూయ, అద్దంకి, శ్రీవత్స, రఘు రామయ్య, పారుపల్లి- ఇంకా ఎన్నో వేలమంది పాల్గొన్నారు.

వివరములకు:

ఆంధ్రా: పూర్ణా పిక్చర్సు, గాంధీనగర్, బెజవాడ. రాయలసీమ: మల్లికార్జునా పిక్చర్సు, నంద్యాల. నైజామ్: దక్కన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు, హైద్రాబాద్.

# మీ పిల్లలు బలారోగ్యంగా పెరిగేటట్లు చూడండి

హిందూ దేశంలో ముఖ్యంగా దక్షిణ ప్రాంతాలలో ఆహార వస్తువులందు సత్తువతనం లేదనీ అట్టి ఆహారాలపై పెరిగే శిశువులు ఆరోగ్యవంతులుగనూ, దృఢకాయులుగనూ ఉండరనీ శాస్త్రకారులు వక్కాణించుచున్నారు.



మెక్లెక్ వారి శిశు ఆహారములలో ముందుగ జీర్ణింపించిన శాకాహారపు ప్రొటీన్లసారము, గ్లూకోసుఉన్నాయి. మెక్లెక్ సిరప్ కాల్విటాలులో ముఖ్య విటమిన్లు ఖనిజలవణాలు ఉన్నాయి. ఈ రెండూ శిశు ఆహార లోపాలను తీర్చడానికి ముఖ్యమైనవి.

మీ శిశుశరీర పోషణ మీ చేతిలో వున్నదే! వారికి మెక్లెక్ ఆహారాలిచ్చిన మీదట ఎలా పెరుగుతారో మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది.

సమపాలనాహారాలకు ఈ మెక్లెక్ ఆహారములు మహాసహాయకారులని ఆహారపరిశోధకులు ప్రకటించారు. మెక్లెక్ ఆహారాలు సులభ జీర్ణవంతములు, ఖనసారవంతములు; కాని మందులూ మత్తు కల్పించేవి కావు.

★ శిశువులకు! మెక్లెక్ వారి ప్రొటీను లోపనివారణీ యాహారము.

విటమిను లోపనివారణకు; సిరప్ కాల్విటాల్.

**మెక్లెక్ న్యూట్రిమెంట్సు**

మీ ఆహార పదార్థములను సమపాలనం చేయును.

వివరాలను ఈ క్రింది వారినడగండి.

మెక్లెక్ న్యూట్రిమెంట్సు అండ్ ఫార్మాస్యూటికల్సు, లిమిటెడ్.

99, ఎ. ఆర్మీనియన్ స్ట్రీట్ జి. టి. మద్రాసు.

# తాజా

## చెరకు పంచదార...

స్వీట్సులో ఉపయోగించే వస్తువులలో తాజా చెరకు పంచదార, శుద్ధమైన గ్లూకోజు చాలా ముఖ్యమైనవి. సావరిన్ స్వీట్సులో శ్రేష్ఠమైన, పరిశుద్ధమైన పంచదార, గ్లూకోజు ఉపయోగించబడ్డవి. మీకు ఏది రుచో చూడడానికి మా దగ్గర ఉన్న కొన్ని రకాలు తీసుకొని చూడండని మా సలహా. మా స్వీట్సు చాలా రుచిగా ఉంటవని అనేక వేలమంది పిల్లలు మాకు చెప్పారు...వాళ్లకు తప్పకుండా తెలుసు.



దేశమంతా ఆదరించబడినవి



# సావరిన్ స్వీట్సు

కె. సి. పి. తయారీ

KCK 4T6






లివర్ & స్ప్లీన్ వ్యాధులచే బాధ పడుచు, యితర ఔషధములచే నివారింపబడజాలని శిశువులు వేలకొలది, యీ అద్భుత ఔషధ రాజముచే రక్షింపబడిరి.

జమ్మి వెంకట-రమణయ్యగారి

# లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రసిద్ధిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలో కెల్ల నొక విశిష్టాంశముగా శ్లాఘించుచున్నారు.

అన్ని కెమిస్టుల వద్ద దొరుకును. లేనిచో నేరుగా మాకు వ్రాయుడు.

జమ్మి వెంకటరమణయ్య & సన్సు

1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.

బ్రాంచీలు : బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, తిరుచిరాపల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.




నూరుపాళ్లూ వైద్యరీత్యా తయారుచేసిన

# నేత్రవృద్ధి తైలము

ఒకసారి ఉపయోగించి చూడండి.

ఈ నూనె వాడితే తెల్లని కురులు నల్లగాను, నిడుపుగాను అవుతుంది. శాలేశ్వరము పోగొట్టి శిరస్సునకు చల్లదనము గ్యారంటీతో గుణము ఇస్తుంది.

## డాక్టర్ వి. ఎన్. పిళ్లెయ్

శ్రీ రాజరాజేశ్వరీ సిద్ధ నిలయం

నెం 15, జనరల్ సామినాయకన్ వీధి,
తిరువళికేణి మదరాసు,

4 ఔన్సు వెల రూ 1-12-0
24 ,, వెల రూ 9-0-0
తపాల్ ఛార్జి వేరు.

☞ మావద్ద కడుపునొప్పి, తేమలు, కాశము, ఆస్తమ, తెల్లకుష్టు, కుష్టు, చర్మవ్యాధులు మొదలగు తీరనివ్యాధులను ఉత్తరవాదముతో తీర్చబడును. వివరములకు వ్రాయుడు. ఏజంట్లు కావలెను.

## మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

## యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం

# స్కూళ్లు తెరచారు

౩

కొత్తగా మళ్లీ స్కూళ్లు తెరచారు. కమల, విమల, థర్డుఫారం ప్యాసయి, ఫోర్తుఫారంలోకి వెళ్లారు. విరళమాత్రం పరిక్ష తప్పిపోయింది. అంచేత, థర్డుఫారంలోనే వుండిపోయింది. కొత్తగాస్కూలు తెరిచిన నాడు అందరూ కలుసుకొన్నారు. విరళ పరీక్ష తప్పిపోయినందుకు కమల, విమల, విచారించారు.

కమల :—విరళా! నువ్వు కూడా ప్యాసయితే ఎంతో బాగుండేదే.

విరళ:—నేనేం చెయ్యను? పోయిన సంవత్సరమంతా నేను సరిగ్గా చదవడానికి వీలులేక పోయింది. రెండేసిరోజుల కొకసారి కడుపునొప్పి రావడం, అంచేత నేను స్కూలుకు రాలేక పోవడం జరిగింది కదా!అంచేత, పాఠాలలో చాలా వెనక పడిపోయాను.

విమల:—అవునే మీ యింట్లో అందరికీ యీ అజీర్ణపుజబ్బులు వస్తూవుంటాయి, ఎంచేత?

విరళ—ఏమో నాకు మాత్రం ఏం తెలుసు?

కమల:—మీరు కూరలలో నూ పచ్చళ్లలోను మంచి యింగువ గనుక వాడినట్లయితే యీ అజీర్ణపుజబ్బులు రావు. నువ్వు రోజూ స్కూలుకు వెళ్లి చదువుకోవచ్చును.


విరళ:—మంచి యింగువ అంటే ఏది?

కమల:—తిలక్ మార్కు ఇంగువ. మాయింట్లో రోజూ అదే ఉపయోగిస్తాము. మాకు అజీర్ణపు బాధే లేదు.

విరళ:—అది ఎక్కడ దొరుకుతుంది.

తిలక్ మార్కు యింగువ అంతటా దొరుకును, మరియు

**గోపాల్జీ చాంప్సీ అండ్ కో,** 30, గోవిందప్పనాయక వీధి, జీ. టి. మద్రాసు, వారివద్ద దొరుకును.




'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు: న్యాయపతి రాఘవరావు. బి.ఎ.

సహాయ సంపాదకురాలు: న్యాయపతి కామేశ్వరి బి.ఎ.,ఎల్.టి.

సంపుటి 2] జూలై 1947 [సంచిక 12

# గోటూ-గొప్పా

బాలా!

నువ్వు పరీక్ష ప్యాసయావు. పెద్దక్లాసులోకి వచ్చావు. చాలా సంతోషం.

కొత్త క్లాసులో నీకు కొత్త స్నేహాలూ, కొత్తనేస్తాలూ, కలుస్తాయి. నీకొత్త నేస్తాలతో నీవు గర్వంగా, గోటుగా, గొప్పగా తిరుగుతూ వుంటావు. పరీక్షపోయిన పాతస్నేహితుడు కనబడితే, పాపం వాడిని పలకరించవు. వాడిపరీక్ష పోయింది! నువ్వు ప్యాసయావు! అంచేత వాడికంటే నువ్వే గొప్ప! వాడితో మాట్లాడితే నీకు పరువు తక్కువ. ఏం? ...... ఇంటువంటి బాలలు మీలో లేరనా? కొందరు వుంటారు.

బాలా! పరీక్ష తప్పిపోయిన వారిని అలాగ నిరసనభావంతో చూడకూడదుసుమీ! పాపం వాళ్లకు శ్రద్ధతక్కువ చేతనో, ఇంకేకారణంవలననో పరీక్ష పోయివుంటుంది. అంతమాత్రాన వారిని చులకనగా చూడ వచ్చునా?

◆ ◆ ◆ ◆

ఇంకోచిన్న సలహా. నీబడిలో చాలామంది బీదబాలురు కూడా వుంటారు. వారు అన్నిపుస్తకాలూ కొనుక్కోలేరు. నిన్ను నోరెత్తి అడగలేరు. అటువంటి బీదబాలురకు వాళ్లు నిన్ను అడగకుండానే వారికి నీదగ్గరవున్న పనికివచ్చే పాత పుస్తకాలు బహుమతిగాఇస్తే నీకు ఎంతో పుణ్యం. గొప్పబాలా! బీద బాలలకు సహాయం చేస్తావు కదూ?

# బడులు తెరిచారు

బాలలము మేము—

క—ఖ—గ—ఘ చదివెదము
కమ్మని తెలుగు నేర్చెదము

ట—ఠ—డ—ఢ చదివెదము
టక్కరి మాటలు విడిచెదము

ప—ఫ—బ—భ చదివెదము
పంక్తులు చక్కగ వ్రాసెదము

ఎ—ఏ—ఐ లూ చదివెదము
ఎప్పుడు ఓర్మితో ఉండెదము.

రచన: యన్. ఆంజనేయులు (నిడదవోలు)

---

★



★

## బాగా చదువుకో

బాలా!

ఈ బాల ఎవరో తెలుసా?

చి॥ జటావల్లభుల సుగుణాదేవి! కాకినాడ. వయస్సు 11 ఏండ్లు. ఆంధ్ర విశ్వవిద్యాలయమువారి భాషాప్రవీణప్రవేశ పరీక్షలో ప్యాసయింది.

చూచావా యీబాల తెలివి తేటలు!

# ఇవి మాకు కావాలి

నాన్నా! బడులు తెరిచారు నాన్నా! బడికివెళ్లి బుద్ధిగా చదువుకుంటాం. ఇదుగో యీదిగువ చదరంలో మాకుకావలసినవన్నీ బాలన్నయ్య రాశాడు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఒ | త్తు | కా | గి | పం | వా | కా | గి |
| లు | టూ | ప | ల | బ | చ | ల్లి | తా |
| శ | ప | ము | ల | క | క | పె | ల |
| దే | ల | క | ప | టు | ము | బు | రూ |
| ట్టె | ము | సి | డ్డే | పా | ళో | స్కే | ళ్లే |
| పె | ల | రా | బు | న్సి | పె | రు | కా |
| రం | గు | యుం | త్రా | లు | ర | బ్బ | గి |
| క్కు | బు | గు | లు | క్కు | బు | ల | తా |

BALA

నాన్నా! ఇవి కొనవూ?



# ★ రాము

[చాలా దినాలకి మన రామూ - సోమూ కలుసుకున్నారు]

రాము: సోమూ! చాలా దినాలయింది మనం కలుసుకొని.

సోము: అవును రామూ! ఏదీ- నా సంగతి నీకు తెలుసునుగా! పని లేదు తీరుబడి లేదు.

రాము: అయితే ఇన్నాళ్లూ ఎక్కడున్నావూ?

సోము: మన బాలరాజ్యం అంతా తిరిగి తిరిగి వచ్చాను.

రాము: మన బాల రాజ్యంలో అందరు బాలలూ బాగున్నారా?

సోము: ఎక్కడ చూచినా, చదువుకొంటున్న బాలురు కంటే చదువులేని నాలాంటి సోములే ఎక్కువ మంది కనుబడుతున్నారు!

రాము: ఇందులకు కారణం?

సోము: పెద్దవాళ్లరాజ్యంలో మన బాల రాజ్యం కలిసి పోయింది. మన సంగతులన్నీ పెద్దవాళ్లే చూస్తున్నారు. మనకి కావలసినన్ని బడులు పెద్దలు పెట్టించలేదు. అదేకారణం అనుకొంటాను.

రాము: బాగాఅన్నావు. ఈ పెద్దవాళ్లు వాళ్ల గొడవల్లో మన మంచిచెడ్డలు సరిగా చూడకుండా వున్నారు. పట్టుబట్టి ప్రతి పల్లెటూరిలోనూ పాఠశాలలు పెట్టి ప్రతిపిల్లవాడికీ చదువు చెప్పిస్తే ఎంతో చక్కగా ఉండును మన రాజ్యం.

# సోము ★



సోము: అలాగ మన పెద్దవాళ్లు చేయ లేదనేగా మనం వేరే బాలరాజ్యం పెట్టుకోవడం.

రాము: సోమూ! సరేగాని, ఇప్పుడు వున్నమట్టుకు బడులలో సంగతులు ఎలాగున్నాయో నీకు తెలుసునా?

సోము: ఇన్నాళ్లూ తిరిగితిరిగి నేను తెచ్చిన సంగతులే అవి. ఇదుగో చూశావా నాచేతిలో ఏమిటుందో?

రాము: ఏదీ ఏదీ చూపించు... ఏమిటా కాగితాలకట్ట!

సోము: మన బాలలు వారివారి బడుల గురించి వ్రాసిఇచ్చిన సంగతులు.

రాము: ఏవీ- కొన్ని చదివి వినిపించు. బడులలోని మంచి చెడ్డలు తెలుస్తేనేగాని బడులు బాగుపడవు. ఏదీ చదువు.

సోము: ఇప్పుడు కాదు రామూ! మనం జరుపబోయే మన శాసన సభలో చదువుతాను.

రాము: నీ ఆలోచన బాగుంది. అలాగే కానీ. ఈలోపుగా మనం ఆ సభలో చర్చించబోయే విషయాలన్నీ తెలుసుకొని వుందాం.

సోము: అలాగే.

ఒచ్చేనెల సంచికలో "బాల శాసన సభ" ముచ్చట్లు చదవండి—సం॥



# ★ సరళ

సరళ:— అదేమిటి విరళా! నీపెట్టెలో బట్టలన్నీ సర్దుకుంటున్నా వేమిటే? ఎక్కడికీ ప్రయాణం?

విరళ:— ఎక్కడి కేమిటే? కొంప మునిగిపోతోంది......

సరళ:— ఏమిా,...ఏమిటి జరిగింది?

విరళ:— అన్యాయం. అన్యాయం. ఘోర అన్యాయం జరిగి పోతోంది.

సరళ:— ఏమిటే, విరళా! గాబరా పడకు. చెప్పు.

విరళ:— తెలుగు బాలికలకు ఘోర అన్యాయం జరుగుతోంది.

సరళ:— ఎందులో?

విరళ:— ఎందులోనా? అన్ని విషయాల్లోను. చదువు కుందుకు కావలసినన్ని బడులు లేవుకదా! సంగీతం, కుట్టు అవీ నేర్చుకుందుకు, ఆటలూ అవీ ఆడుకుందుకు, సదుపాయా లేమిా లేనేలేవు. ఛీ, ఛీ, ఇటువంటి మొగవాళ్ల రాజ్యంలో ఆడపిల్లలు ఉండకూడదు. నేవెళ్లిపోతాను.

సరళ:— ఉండు విరళా, తొందరపడకు. ఇప్పుడు నువ్వనే దేమిటి!

విరళ:— మనం వేరే "ఆడపిల్లలరాజ్యం" ఏర్పరచు కుందాం. అప్పుడు మనకి కావలసినన్ని సదుపాయాలు మనమే చేసుకోవచ్చు. ఆడపిల్లల రాజ్యంవేరు. మొగవాళ్ల రాజ్యంవేరు.

సరళ:— బాగుంది విరళా! అదెలాజరుగుతుంది?

విరళ:— ఏమిా? ఇపుడు మనదేశంలో తురకలువేరుగా విడిపోయి, వాళ్లరాజ్యం పెట్టుకుంటున్నారటగా? అలాగే మన ఆడవాళ్లం అందరంకలిసి వేరేరాజ్యం పెట్టుకుందాం.

# విరళ ★



సరళ:— ఓసి విరళా! ఎంత వెర్రిదానవు నువ్వు! ఆడవాళ్లకి ఒకరాజ్యం, మొగవాళ్లకి ఒకరాజ్యంనా?

విరళ:— ఔను, అయితేనేం?

సరళ:— సరేలే. అయితే మీనాన్న, అన్న, తమ్ముళ్ళూ ఒకరాజ్యంలో వుంటే, మీఅమ్మ, అక్క, చెల్లెళ్ళూ వేరేరాజ్యంలో వుండాలన్న మాట! వాళ్లకీ వీళ్లకీ ఏమీ సంబంధం లేదన్నమాట కదూ! వాళ్లఇల్లువేరు, మనయిల్లువేరు. డబ్బుసంపాదించే నాన్నగారు వేరు, మనకు అన్నంపెట్టేఅమ్మవేరు. ఇలాగయితేమనగతి అడగనక్కరలేదు. చక్కగా అందరం ఒకటిగా వుంటేనేకదా మనచదువు, మనఆటలు, మనపాటలూ జరుగుతాయి. 1

విరళ:— అయితే ఇప్పుడు నన్నేం చేయమంటావే?

సరళ:— ఉండు. ప్రతీదానికి మనం తొందరపడకూడదు. నిజమే, మన చదువుకీ సంగీతానికీ ఆటలకీ పాటలకీ తగిన సదుపాయాలు చేయించాలి. మన బాలశాసన సభలో వీటన్నిటిని గురించి మాట్లాడుదాం.

విరళ:— బాలశాసనసభ ఎప్పుడుజరుగుతుంది ?

సరళ:— వచ్చేనెలలోఅని అనుకుంటున్నారు. ఈలోపుగా మనం మాట్లాడవలసిన ముఖ్య విషయాలన్నీ జాగ్రత్త చేద్దాం. ఏమంటావ్?

విరళ:— ఔను, నిజమే. అలాగేచేద్దాం.


# "పాపడు"

రచన : దాసరి వెంకటరత్నం (కాకినాడ)



వీడేనమ్మా పాపడు వీడేనమ్మా
అల్లరి పాపడు వీడేనమ్మా
కాళ్ళా గజ్జెలు చూడండి
కళ్ళా కాటుక చూడండి
మెళ్ళో పూసలు చూడండి
మొల్లో మువ్వలు చూడండి.
వీడేనమ్మా పాపడు వీడేనమ్మా
అల్లరి పాపడు వీడేనమ్మా
పసిడీ దేహము చూడండి
సుందర వదనము చూడండి
కలువా కన్నులు చూడండి
చక్కని బొజ్జా చూడండి
ముద్దూ పలుకులు వినరండి
చిన్నీ ముద్దూ పెట్టండి
వీడేనమ్మా పాపడు వీడేనమ్మా
అల్లరి పాపడువీడేనమ్మా
ఆటలు ఆడే పాపడు
పాటలు పాడే పాపడు
పాలు త్రాగే పాపడు
పరుగున పోయే పాపడు.
అల్లరిచేయక —
మెల్లన వెళ్ళండి
పాపడ్ని పట్టండి
వంతుల కివ్వండి
ఇవ్వండీ—ఇవ్వండీ.

# బాలతాలూకు




★

బ్యాటూ బంతీ కలిసీ
మాటా మంతీ ఆడాయి
సాయంకాలం దాకా
చాలా సేపటి వరకు
హాయీ హాయిగ
ఆటా లాడగ
పోదాం పోదాం
అన్నాయి
జట్టూ కలిసీ
ఆడాయి.

★

★ నానా ★

పోలికలు



పోలికలు

చూచారా! తాళం కప్పులాంటి మొహాం ఏదునూ!


జూలై 1 నుండి ప్రారంభం

# నవభారతి గురుకులము

## రాజమండ్రి స్థా: (1940)

ఆంధ్రమెట్రిక్యులేషను పరీక్షకు శిక్షణ గరపబడును.

మంచి విద్య, ఆరోగ్యకరమైన ఆటపాటలు, చక్కని భోజనాది వసతులు.

భోజనము, వసతి, ట్యూషన్ మొదలయిన అన్నిటికీ ఫీజు. నెలకు

4, 5 తరగతులకు...... రు. 25/-
1, 2, 3 ఫారములకు... రు. 27/-
4, 5, 6 ఫారములకు... రు. 33/-

రాజమండ్రి
25-6-47

టి. బుల్లెయ్య, ఎం. ఏ.
కరస్పాండెంటు

# ★ మా పాప ★



మా పాప అందం
మతాబీల చందం

మా పాప హాసం
గులాబీ వికాసం

★ ★



మా పాప వాక్యం
జిలేబీల పాకం

మా పాప కోపం
పకోడీల కారం

రచన : గిడుగు వెంకట సీతాపతి.

# రేడియో పిల్లలు



బాలా! నువ్వు ప్రతీ ఆదివారం రేడియోపిల్లల ప్రోగ్రాం వింటున్నావా?—ఈ బొమ్మలో రేడియోమిరపకాయ, "రేడియోతాత", రేడియో అన్నయ్య, రేడియో అక్కయ్య వున్నారు. పోల్చుకో!

#  జబ్బుకు తగిన మందు 

రచన: టి. ఎస్. ఆర్. మూర్తి; మూలం: 'హే'

బాలా బాలా వింటావా?
కథొకటి చెప్తా వింటావా?
అనగనగా నొక
రాజున్నాడు.
రాజుకు జబ్బుగ
వుందన్నాడు.
వైద్యులందరిని
పిలిపించాడు.
అందరు కలసీ
చూశారు.
పరీక్ష బాగా
చేసారు.
జబ్బుయేమీ
లేదన్నారు.
రాజుమాత్రం
వుందన్నాడు!
రాజుకు కోపం
వచ్చింది.
వైద్యులందరిని
చంపించాడు!

* * *

చాలాకాలం-గడిచింది.
రాజుకురోగం-పోలేదు
మరో వైద్యుడు-వచ్చాడు
పరిక్షచేసీ-చూచాడు
తెలివిగ ఆలోచించాడు
చివరకు యిట్లా-చెప్పాడు.
"ఆనందంగా-వున్న పురుషుని
చొక్కా-తెచ్చి-రాజుకుతొడిగితె
ఒక్కరోజులో-జబ్బంతాను
నయమౌతుంది-నయమౌతుంది"

* * *

రాజాగారి-నౌకర్లందరు
రాజ్యమునంతను-గాలించారు
గొప్పా-బీదా
అంతాకూడా

కష్టంలోనే-ఉంటున్నారు.
ఆనందంగా-యెవ్వరు లేరు.
తుదకో బాలుడు-కనిపించాడు.
పచ్చికబీడులో-ఈలలు వేస్తూ
అల్లరిచేస్తూ-సంతోషంతో
తైతక్కలాడుచూ-గెంతాడు.
చోక్కామాత్రం-లేదాతనికి !

* * *

ప్రజలకువచ్చిన-కష్టాలన్నీ
రాజుకురోజూ-తెలిసాయి
రాజుకుమనస్సు-మారింది
రోగంయేమీ-లేదన్నాడు.
రాజ్యముబాగా-ఏలేడు.
ప్రజలు సౌఖ్యం-పొందారు
రాజును అందరు-పొగిడారు.
రాజుసుఖముగా-వున్నాడు.

# హెచ్చాలీ-కావాలీ

బాలల దేశద
భావి రాజ్యమూ
చదువులు లేకను
సాగదు రాజ్యం
చదువు బాలలకు కావాలీ
చదువుకు _ పంతుళ్లుండాలీ
పంతుల జీతంహెచ్చాలీ
పంతుల కడుపులునిండాలి
పంతులు దుఃఖంపడితేనూ
బాలలు దుఃఖంపడతారూ
బాలలు దుఃఖంపడితేనూ
భావిరాజ్యమే మరి లేదు
పంతులజీతం హెచ్చాలీ
చదువులుచక్కగ సాగాలీ

రచన: సి. సుబ్రహ్మణ్యము
కాశీబుగ్గ.

# ఉండాలి మరి

రాజ్యానికి రాజు
రాజుకు రాణి
రాణికి రత్నాలహారం
ఉండాలోయ్ ఉండాలి.

గుడికి పూజారి
పూజారికి పులిహోర
పులిహోరకి పుల్లదబ్బ
ఉండాలోయ్ ఉండాలి.

పాఠశాలకి పంతులు
పంతులుకి పాపాయిలు
పాపాయిలకు చేతిపనులు
ఉండాలోయ్ ఉండాలి.

రచన: పి. జయరావు (తంగుడుబిల్లి)

♦ ♦ ♦

# రాజు నవ్వుకి కారణమేమి?

అనగా అనగా ఒకరాజు ఉండేవాడు. ఒకనాడు ఆరాజు మంత్రి, సైన్యముతోసహా అడవికి వేటకివెళ్లాడు. మిట్టమధ్యాహ్నం వరకు వేటాడివేటాడి, అలసిపోయాడు.


అప్పుడు ఆ దగ్గరగావున్న తాటిచెట్టు నీడను రాజూ, మంత్రీ నిలబడ్డారు. కొద్దిదూరంలో ఒక పెద్దమర్రిచెట్టు క్రిందకు తనసైన్యం పోయి నిలుచుంది.

రాజు ఆమర్రిచెట్టును, యీతాటిచెట్టునూ చూచి తనలో నవ్వుకున్నాడు.

రాజు నవ్వుకి కారణం మీరు చెప్పుకోండి చూద్దాం!

రచన: యం. కె. రెడ్డి.

## ఈ పాపని ముద్దుపెట్టుకో




చి॥ చాగంటి సుగుణ.

# పళ్లు

నాదగ్గర నాలుగు పళ్లున్నా యని గర్వంగా అన్నాడు రామం.

ఏవీ చూపించూ అన్నాడు వేణు.

ఇవిగో చూడు అని, చేతిలో వున్నయీ



చూపించాడు.

వేణుకి దుఃఖంవచ్చి, నా దగ్గర 20 పళ్లు వున్నాయి అని అన్నాడు గొప్పగా!

ఏవీ చూపించూ అన్నాడు రామం.

ఇవిగో అని తన నోటి—



ఇగిలించి చూపాడు.

బలే బాగుందన్నారు మిగిలిన బాలలు!


# పిల్లలూ!

మంచి బాగాచేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్‌కో పౌంట్ ఇంక్‌తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నా రనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్‌కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెని

మదరాసు - బెంగళూరు - ఎర్ణాకులం.

# కుక్కల బండి



రచన: పాలంకి వెంకటేశ్వర్లు, కాకినాడ.

బాల సోదరులారా,


నిన్న నేను కూరలు కొందామని మార్కెట్టుకు బయలుదేరేను. కొంతదూరము పోయేసరికి రెండు, మూడు కుక్కలు మొఱుగుతూ పరుగెత్తుకుంటూ నన్నుదాటి ముందుకు పోయాయి. అదేమని ఎదుట చూడగా ఒక మనుష్యుడు ఒక ఉచ్చువేసి ఒక కుక్కను పట్టుకొని లాక్కుంటూ పోతున్నాడు. మిగతా కుక్కలన్నీ అక్కడచేరి అతనిని అడ్డుపెట్టపోయాయి. కానివాటికి సాధ్యం కాలేదు. అతడా కుక్కను ఒక పెద్దబోను వలెనున్న బండితలుపు తెరచి అందులో పడవేసి తలుపు మూసేసాడు. అప్పుడా కుక్క 'కుయ్యో, మొఱ్ఱో' అన్నట్లు ఎంతో దీనంగా ఏడ్చింది. మిగిలిన కుక్కలు మొఱిగి, మొఱిగి వెనుకకు పోయాయి.

నేనాతని దగ్గరకు పోయి "ఏమయ్యా, ఏమిచేస్తావు ఆకుక్కను? దానినలా బాధపెడుతున్నావెందుకు?" అని అడిగేను. "నాకేం తెలీదు బాబయ్యా! మునిసిపాల్టీవారు ఎన్నికుక్కలు పట్టుకుంటే అన్ని రూపాయ లిస్తామన్నారు. అందుకోసము పట్టుకొంటున్నాను. వారు వీటిని చంపేస్తారు" అన్నాడాతడు. ఇలా అతనితో మాట్లాడుతూ నడిచేసరికే మ్యునిసిపల్ ఆఫీసు వచ్చింది. "ఆయన్ని అడగండి బాబయ్యా తెలుస్తుంది. ఆయనే మాయజమాని" అంటూ ఒక శానిటరీ ఇనస్పెక్టర్ని చూపించేడు. నేను ఆయనయొద్దకుపోయి "ఏమండీ ఇనస్పెక్టగారూ, ఈకుక్క

లనుపట్టుకొమ్మన్నారట, అవి ఏమి చేస్తాయి, నోరులేని జంతువులు వాటి మాంసమన్నా తినుటకు పనికిరాదే! ఎందుకు వాటిని అనవసరంగా బాధపెట్టి చంపిస్తారు!” అని అడిగేను.

అప్పుడు ఆయనిట్లా అన్నారు “ఇవిచాల ప్రమాదకరమైన జంతువులు. వీటికి పిచ్చి ఎక్కుతుంది. పిచ్చెత్తిన కుక్కలు మనుష్యులను కరుస్తాయి. అప్పుడు వారికి ‘హైడ్రోఫోబియా’ అనువ్యాధి వచ్చి పిచ్చి కేకలు వేసిచనిపోతారు. ఈవిధంగా మనదేశంలో ప్రతియేట నూటికి పదిహేను మంది చనిపోతున్నారు. కనుక అలాంటి ప్రమాదము రాకుండ ఉండాలంటే ఈకుక్కల నన్నింటినీ పట్టుకొని చంపెయ్యాలి. అందుకోసమే వీటిని పట్టించి చంపివేయిస్తున్నాము. వాటిని బాధపెట్టము. చాల సునాయాస మరణము కలుగ జేస్తున్నాము. ఒకవిషవాయువుగల గదిలో వీటిని పడవేస్తాము. అవి తత్క్షణమే చనిపోతాయి.

ఆయన చెప్పిన దంతా విన్నాను. దానికి ఏమి సమాధానము చెప్పాలో మాత్రము నాకు తెలియలేదు. మీరుకూడ ఆలోచించండి. కుక్కలన్నింటికీ పిచ్చి ఎత్తుతుందా లేక కొన్నింటికే ఎత్తుతుందా? కొన్నిటికే ఎత్తితే అన్నిటినీ చంపడం ఎందులకు? వాటికి పిచ్చెత్తకుండా చేయడానికి ఏం మార్గము లేదా? మశూచికము రాకుండా టీకాలు పొడుస్తారే! ఈకుక్కలకు పిచ్చెత్తకుండా ఏమి సాధనంచేయడానికి వీల్లేదా? ఈ నోరులేని జంతువులను ఇలాదారుణంగా ప్రాణం తీయవలసిందేనా? ఈకుక్కలు మిక్కిలి విశ్వాసంగల జంతువులు, నమ్మకమైన బంట్లు అంటారే, కాస్త అన్నము పడేస్తే ఇల్లు కనిపెట్టుకొని ఉంటాయి. అటువంటి వాటిని ఈ విధంగా బలివేయవలసిందేనా?



# ఇది కాని ఇది — ఇది

[జూన్ నెలలోని ప్రశ్నలకు జవాబులు]

కోడిగాని కోడి - పకోడి; కాలుకాని కాలు - జూకాలు, టీకాలు గొడుగుకాని గొడుగు - కుక్కగొడుగు; పండుకాని పండు - విభూతి పండు; కొమ్ముకాని కొమ్ము - పసుపుకొమ్ము; పాలుకాని పాలు - కోపాలు, తాపాలు; సందుకాని సందు - పసందు; నూలుకాని నూలు - కర్నూలు; డోలుకాని డోలు - భీమడోలు; రాయికాని రాయి - సారాయి; మానుకాని మాను - ముసల్మాను; సారికాని సారి - సంసారి; సాలుకాని సాలు - మినాసాలు; సాముకాని సాము - అస్సాము; సీలకాని సీల - సుశీల; కారుకాని కారు - షికారు, సాహుకారు; ధనంకాని ధనం - సాధనం; బంటుకాని బంటు - ఎలుగుబంటు; పిట్టకాని పిట్ట - లొట్టిపిట్ట; చిలుకకాని చిలుక - సీతాకోక చిలుక; కప్పకాని కప్ప - మండ్రకప్ప, తాళంకప్ప; చెవికాని చెవి - తాళంచెవి; కోర్టుకాని కోర్టు - ఫుట్ బాల్ కోర్టు; ధనస్సుకాని ధనస్సు - ఇంద్రధనస్సు; కలం కాని కలం - కలకలం; దయకాని దయ - అభ్యుదయ; తంత్రంకాని తంత్రం - స్వాతంత్రం; పతికాని పతి - తిరుపతి; సారంకాని సారం - నవాసారం; కారముకాని కారము - ఉపకారము; బడికాని బడి - రాబడి; కులంకాని కులం - ఎర్నాకులం, వ్యాకులం; బొమ్మకాని బొమ్మ - కనుబొమ్మ; ఏరుకాని ఏరు - నల్లేరు; మండలంకాని మండలం - కమండలం; తెరకాని తెర - కత్తెర; నత్తకాని నత్త - మేనత్త; కాశికాని కాశి - రాకాశి; మానముకాని మానము - అవమానము, విమానము; మరకాని మర - తామర; వలకాని వల - ఆవల, నవల; కీలుకాని కీలు - వకీలు.

బాలా! యీ పైవికాక ఇంకా నీకు ఇటువంటివి తెలుసునా? తెలిస్తే రాయి. — సం॥.

# రెండేసి అర్థాలు

బాలా!

మన తెలుగు భాషలో చాలా పదములు, ఒక్కొక్క దానికి రెండేసి అర్థాలున్నాయి. ఇదిగో మచ్చుకి కొన్ని:

బాల
అడుగు
పట్టు
కొట్టు
ఎత్తు
చెప్పు
పెట్టె
చాటు
కాలు
పాడు
పాలు
ప్రియము
పెరుగు
లాగు
తేలు
పొట్టి
దిక్కు
జోడు
పాత్ర

సంపాదన. గండుపల్లి సూర్యయ్య
(శ్రీకాకుళం)

# వద్దండోయ్ వద్దండి

వ్రాత రాయని - పలకాలూ
గరగర లాడే - బలపాలూ
ములుకులులేని - పెన్సిళ్లూ
పాళీలేని — పేనాలు
వద్దండోయ్ వద్దండి.

♦ ♦ ♦

పాటలురాని — బాలికలు
ఆటలు ఆడని - అబ్బాయిలు
చదువులు చెప్పని — మేష్టార్లూ
పకపక నవ్వని పాపాయిలూ
వద్దండోయ్ వద్దండి.

రచన: అడపా వెంకటేశ్వరరావు
(ఉంగుటూరు)





# ఆవకాయ ★ కథ

రచన: సి. శేఖర్. డి.,(మదరాసు)

బాలా! ఆవకాయరుచి బలే బాగుంటుంది. ఇటువంటిఆవకాయ గురించి ఒక కథవుంది. చెప్తావిను.

పూర్వం ఒకసారి, మామిడి కాయలు, పండ్లు, ఒకసభ చేశాయి. అందులో ఎవరు గొప్పవారు, ఎవరు రాజపదవికి తగినవారు అని తగవు వచ్చింది.

అందులో మాల్గోవ, అంటు మామిడి, నీలము, రసము, పుల్ల మామిడికాయ, మేము గొప్ప అంటె, మేముగొప్పయని, వాదించుకొనటం మొదలెట్టాయి. ఎంతసేపటికి ఆ తగవు తెగక బ్రహ్మదేవుని యొద్దకు, తీర్పుకోసం వెళ్ళాయి. అప్పుడు బ్రహ్మదేవుడు వాటివాటి గొప్పలను చెప్పుకోమన్నాడు.

మాల్గోవా లేచి: "దేవా! అందరికంటె నేను తీపుగా వుంటాను. నన్ను చూస్తే అందరికి చాల ఇష్టము. కావున నన్ను మించినవారు రాజపదవికి లేరు. అందువల్ల నేనేరాజుగా వుంటాను."

రసములేచి: "నాలోయున్న రసము ఎవ్వరిలోనూలేదు. చాలా రుచిగా వుంటాను. అంచాత నేనే రాజపదవికి తగినవాడను."

అంటుమామిడిలేచి: "నీగొప్ప ఇంతగా చెప్పుకోవాలా? నీసంగతి మాకంతగా తెలియదను కొన్నావా? రెండురోజులువుంచుతే కుళ్ళుకంపు కొట్టుతావు. నేను చూచావా ఎంత వాడనో. నా ముక్కు చూచినావా ఎంత పెద్దదో! నీకన్న ఎక్కువరోజులు యుంటాను. అంచేత నేనే రాజ పదవికి తగుతాను."

నీలం: "ఓసి అంటు మామిడీ! నీసంగతి ఇంతగా చెప్పుకోవాలా? నీయొక్క జీవితము జ్ఞప్తికి తెచ్చుకో. నీకు ఒక జాతివుందా? వంశభ్రష్టము చెందిననీకు రాజ పదవి కావాలా? ఇది ఎవ్వరికీ సమ్మతంలేదు. నన్ను చూడండీ, శ్రీకృష్ణమూర్తివర్ణము కలవాడను. దైవాంశ సంభూతుడను. అంచేత నేనే ఆ పదవికి తగిన వాడను."

పుల్లమామిడిలేచి: "ఏలిన వారికి చెప్పతగినవాడను కాను.

అయినను సమయము వచ్చినప్పుడు తన్నుతాగురించి చెప్పవలసినప్పుడు చెప్పవలయును. నేను ఎన్ని సంవత్సరములు అయినను చెడిపోకుండా యుండెదను. నాలో ఏభాగము వృధాపోదు. అన్నిరకముల వాటిటెంకలు పారవేసినను నన్ను మాత్రము గౌరవించెదరు. కావున నేనే అర్హుడను. ఇక దేవర వారిచిత్తం" అని నమస్కరించి కూర్చుంది.

బ్రహ్మదేవుడు: "సభాసదులారా! మీవాదము లన్నియు వింటిని. నాకు చూడ పుల్లమామిడియే గొప్పగా తోచుచున్నది. పుల్లమామిడీ! నీవు కోరకయున్నను ఒక వరము ప్రసాదించెదను. నీవు సకల కాలములందు ఆవ, నూనె, ఉప్పు, మిరపపొడి మొదలగు సేవకులతో నిరంతరము రాజగృహమైన, "జాడి" యందు "ఆవకాయ" యను నామధేయముతో విలసిల్లుగాకా!" అని అనెను.

అప్పుడు అన్ని కాయలు, పండ్లు, "ఆవకాయకు జై" అను కరతాళధ్వనులు చేశాయి!


ఉచితము! ఉచితము!!

(ఆర్యవైశ్యుల చరిత్ర - శ్రీనివాస కన్యకాపరమేశ్వరీ చరిత్ర

**1. వాసవీ కన్యక :** ఈ గ్రంథములో అందమైన కన్యకా పరమేశ్వరీ త్రివర్ణ చిత్రపఠము, వచనకావ్యము (సంపూర్ణ చరిత్ర,) ముద్దులొలుకు పద్యకావ్యము, 102 గోత్రముల చరిత్రలు, విమర్శనాభాగములు గొప్పగా శోధించి వ్రాయబడినవి.

**2. వాసవీ విజయము** (రసవత్తరమైన నాటకము)

ముఖ్యముగా ప్రతివైశ్యుని ఇంటవుండవలసిన గ్రంథరాజము.

రూ 5లు గాని (విరాళముగా) అంతకుపైనగాని పంపినవారికి పైన వివరింపబడిన రెండు గ్రంథములు పంపించెదము.

రచన : శ్రీ విద్వాన్ గర్జె సత్యనారాయణ గుప్త.

వివరములకు : గునుపాటి రాధాకృష్ణయ్య

కార్యదర్శి, వాసవీ కన్యకా ప్రచురణ కమిటీ

శిఖరంవారి వీధి, నెల్లూరు అని వ్రాయండి.




◆ ◆ ◆ రచన: "ఆరుద్ర" ◆ ◆ ◆

జానీ సీతని పిలుపులయింటిలో ఒకగదులో కూర్చోబెట్టి వెళ్ళిపోయింది. ఆ గది నిండా సోఫాలూ పడకకుర్చీలూ ఉన్నాయి. సీత ఒకసోఫాలో కూర్చుంది. సోమేశంగారింట్లో ఉన్న మెత్తని పట్టుదూది పరుపులాగ సోఫా ఉంది.

సీతకూర్చున్న గదిలో చక్కని వాసన వేస్తున్నది. సీతకి తనక్లాసు పుస్తకంలో మూడవపాఠం జ్ఞాపకం వచ్చింది. 'పరిమళం' అంటేచక్కని వాసన అని అర్థం అట. మాస్టరుగారు దీన్ని బోధపరుస్తూ, ఊదొత్తులూ, మసాలా కూరలూ లాగే కస్తూరి కూడా చక్కని వాసనతో ఉంటుంది అని చెప్పారు. చీమల గదిలో కస్తూరి ఉంది కాబోలు అనుకొంది సీత.

గదిలో మరెవ్వరూ లేరు. ఒంటరిగా ఉన్నానుకదా అని సీత వాళ్ళ ఇంటిని గురించి ఆలోచించుకొంది. తను అమ్మతోటి చెప్పకుండా వచ్చేసింది. మళ్ళీయింటికి వెళితే అమ్మ కొప్పడుతుంది. ఆవేళ లలితగారింటికి చెప్పకుండా వెళ్ళినందుకు తన్ను కొట్టింది!

అమ్మ బొట్టుపెట్టెలో చిన్న డబ్బీ ఉంది. అందులో పునుగు ఉంటుంది. దానికీ పరిమళం ఉంది. బహుశా ఈగదిలో కస్తూరికాకుండా పునుగు ఉందేమో అనుకొంది సీత. సీతకి మళ్ళా అమ్మ కొడుతుందేమోఅనిభయమేసింది. అమ్మ భోజనానికి ఎదురుచూస్తూ ఉంటుంది.

ఇంతలో ఒక బిళ్ళబంట్రోతు చీమ గదిలోపలకి వచ్చి సలాం పెట్టేడు. అది "బాల సంఘం" వాళ్ళు శాల్యూట్ పాటపాడుతూ పెట్టే సలాం లాంటిది. నాన్న బాల సంఘంలో చేరకూడద న్నాడు. బాల సంఘంలో చక్కటి ఆటలూ, పాటలూ చెప్తారు.

చీమ బంట్రోతు, "మనుషుల ప్రతినిధిగారు! మీకు ఏం కావాల న్నా మీసోఫా పక్కనున్న మీట నొక్కండి. తలుపులు వెయ్యమం టారా! నేను బయట ఉంటాను." అని వెళ్ళిపోయాడు.

సీతకి సుబ్బారావు మావయ్య జ్ఞాపకం వచ్చాడు. సుబ్బారావు మావయ్య కలెక్టరు. ఎంతమందో బిళ్లబంట్రోతులు మావయ్యకి సలాములు పెడతారు. సోమేశం కూడా "మానాన్నలాగే నేను కలెక్టర్ని అవుతాను," అంటాడు. "సోమేశం పెద్ద వాడయాక బంట్రోతులు సలాములు చేస్తారు. నాకు ఇప్పుడే చీమల బంట్రోతులు సలాములు చేస్తున్నారు. సోమేశం ఇక్కడుంటే బాగుండును" అను కొంది సీత. వెంటనే మీటనొక్కి సోమేశాన్ని తీసుకురా అని అం దాం అనుకొందిగానీ లాభం లేదు. చీమలు అందరి మనుష్యులతోటి నే స్తంకట్టవు.

ఇంతలోకే బంట్రోతు తనని ఏదో పేరు పెట్టి పిలిచాడని సీతకి జ్ఞాపకమొచ్చింది. తనకి దానిఅర్థం బోధపడలేదు.

సీత మీటనొక్కింది. బం ట్రోతు "చిత్తం" అంటూ లోప లికి వచ్చేడు. బంట్రోతుని పార ములకి అర్థం చెప్పని అడగకూ డదు. సీతవాళ్ళింట్లో తనకి లెక్కలు రాకపోతే అప్పన్నని అడుగలేదు. అన్నయ్యని అడుగుతుంది. అందు చేత బంట్రోతుని నువ్వు అన్న మాటకి అర్థం చెప్పు అని అడగ కూడదనుకొంది.

చీమ బంట్రోతు "మనుష్యుల ప్రత్యేక ప్రతినిధిగారూ! మీకు ఏం కావాలి" అని అడిగేడు. సీత ఏదో ఒకటి అడగాలి కాబట్టి నాకు దాహం వేస్తున్నాది. కొంచెం మం చినీళ్ళుతే అంది. బంట్రోతు చిత్తం అని ఒకగోడదగ్గరికి వెళ్ళి ఒకమీట నొక్కేడు. ఒకబీరువా తలుపులు తెరుచుకొన్నాయి. అం దులో ఒకగళాసులో మంచినీళ్ళు ఉన్నాయి. బంట్రోతు గ్లాసుని

సీతకిచ్చేడు.

సీత ఆనీళ్ళని తాగింది. నీళ్ళు పరిమళంగా ఉన్నాయి. చల్లగా ఉన్నాయి. సీతకి శంకర్ విలాస్‌లో 'ఐస్ వాటర్' జ్ఞాపకానికొచ్చింది. ఏలకకాయలపొడి కూడా జ్ఞాపకానికి వచ్చింది.

గ్లాసు బీరువాలో పెట్టేసి బంట్రోతు మళ్ళామీటనొక్కేడు మామ్మూలుగా గోడమళ్ళా వచ్చేసింది. ఆశ్చర్య పోయింది!


బంట్రోతు పైకివెళ్ళిపోతూ ఉంటే సీత వాడిని పిలచి "నీపేరేమిటి" అని అడిగింది. వాడు "నూట పదకొండు" అన్నాడు. సీతకి నవ్వువచ్చింది. బంట్రోతు వెళ్ళిపోయాడు. సోమేశం, ఆచారి కొట్టుకున్నారు. సోమేశం ఆచారిని "నూట పదకొండు" అన్నాడు. ఇద్దరికీ దెబ్బలు తగిలి రక్తం వచ్చింది. మాస్టరుగారు ఇద్దరినీ కోప్పడి తప్పా, అలాఒకరి నొకరు హాస్యానికేనా పిలుచుకో కూడ దన్నారు. సీతకావిషయం జ్ఞాపకం వచ్చినవ్వుకొంది.

"జానీ ఇంకారాలేదు. ఏం చెప్మా" అనుకొంటూ ఉంటే బంట్రోతు లోపలకి వచ్చి "సీతాదేవిగారు! తమరు ఇంకోగదిలోకి వస్తారా అక్కడ నెంబరు 44 ఉంటారు" అన్నాడు.

సరే అంది సీత.

బంట్రోతు ఇంకొకమీట నొక్కేడు. మరొకగోడ తెరుచుకొంది. సీతా, బంట్రోతూ అందులోకి వెళ్ళారు.

బాలా! నీకువచ్చేసారి సీత కథ చెబుతాను. ఇప్పుడు వెళ్ళి ఆడుకో.



# ఊత పదాలతో నీతులు

బాలా!

మనం సుచీ శుభ్రమము అయిన కూడూ గుడ్డాకట్టి, అందము చందము, తెలివీ తేటలూ, మతీ సుతీ, దయాదాక్షిణ్యాం కలిగి, చిన్నా పెద్దా, బీదా గొప్పా, ఇరుగూ పొరుగూ వారితో మాటా మంతీ బాగుండి, మంచీ చెడ్డా, అభము సుభము, బాగూ వోగూ తెలుసుకొని, వెర్రీ వేషం, తళుకూ బెళుకులకు పోక, రాయీ రప్పా ధూళీ దూగర్లో ఆడక హాయిగా వుండమని నా మనవి.

ఇట్లు, బాలన్నయ్య.

[ఇందులోని ఊత పదాలు పంపినవారు. చి॥ ఆర్. ఇందువదన, అవసరాల రామకృష్ణా రావు.]


## రీటా తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనవేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి **రీటాయే** వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15 అ.




**RITA**
**HAIR TONIC**

# నాణ్యము — ధరలు

బట్టల వ్యాపారములో నాణ్యము - ధరలు ఈ రెండూ
ముఖ్యముగా గమనింపవలసిన విషయములు.

మంచి నాణ్యము, సరసమైన ధరలూ కావాలంటే చేనేత బట్టలనే కొనవలెను.



మాచే తయారుచేయబడు చీరెలు, ధోవతులు, తువాళ్లు, షర్టింగులు
మొదలగు వాటిపై ముద్రింపబడిన సరసమైన కంట్రోలు ధరలకు
మీరు కొనినచో మా బట్టల నాణ్యము మీకే తెలియును.

మదరాసులోను, అన్ని జిల్లాలలోనూ వుండే
మా విక్రయశాలలలో దొరకును.

## మద్రాసు హ్యాండ్ లూమ్ వీవర్స్
## ప్రావిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లి.

నెం. 6-ఎ. వుడ్సురోడ్ - మౌంటురోడ్, మదరాసు.

# మా తెలుగు సౌధము

తులశమ్మ మాయింట తొలిదేవతమ్మా
పదియారుకళల మా బంగారులక్ష్మి
చిలకల్లు మాతోటి చెల్లెళ్లుగాగ
హంసలే చక్కనీ అక్కయలు మాకు
మాతల్లి చల్లనీ మహికల్పవల్లి
మాతండ్రి గంధర్వ మహరాజవారు
ముగ్గుల్లో ముత్యాలు మొలిపించినాము
పగడాలపూవుల్లు పరిపించినాము
పచ్చనీ పండుగలు పాలల్లో తడిసీ
వచ్చినవి మాయింట వాకిట్లోకమ్మా
మాఅత్తవారిల్లు మామిళ్లనీడా
నీడలో మాబావ మేడేసినాడే
తెలుగుతల్లీ మాకు ఇలవేల్పుయాటా
దీవించి పెంచినది దేవతలు మెచ్చా.

రచన: మానేపల్లి సంగమేశ్వరకవి, చిలకలపూడి.

# బాపూజీ

రచన: శ్రీమతి సుశీలా దేవి.

బాలా! బాపూజీ అనేమాట ఎప్పుడైనా విన్నావా? అర్థం ఏమిటో తెలుసునా?

తెలియదూ? వినలేదూ? బాపూజీ అంటే నాన్నగారూ అని అర్థం. హిందీలో అలా అంటారు. నువ్వు పెద్దదానివయాక పెద్ద పెద్ద చదువులు చదివేటప్పుడు హిందీ కూడ చదువుకుందువు గానిలే.

అయితే బాపూజీ అనేమాట హిందీని మాటాడేవారందరూ తండ్రిని పిలవడానికే వుపయోగించినా మనం దేశంలో వున్నవారందరూ "బాపూజీ" అని ఒక్కడినే పిలుస్తాం. ఆయనే గాంధీ మహాత్ముడు.

గాంధీ మహాత్ముడి పూర్తి పేరేమిటో తెలుసా? మోహనదాస్ కరంచంద్ గాంధి. మనకు యింటిపేర్లెల్లా వుంటాయో అలాగే గాంధీ అన్నది వాళ్ల కుటుంబం పేరు. మోహనదాస్ ఆయన పేరు. కరంచంద్ తండ్రిగారి పేరును తెలియచేస్తుంది.

ఆయనను మనం బాపూజీ అని ఎందుకంటామో తెలుసా, బాలా? ప్రతిమనిషి పుట్టుకకు తండ్రి ఏవిధంగా కారణం అవుతున్నాడో అలాగనే మన దేశంలో ప్రజలు బానిసత్వంలో మునిగి తేలుతుంటే, ఆ నిద్రనుండి అందరినీ మేల్కొల్పాడు. అందుకోసం ఆయనని బాపూజీ అని అభిమానంగా, ప్రేమగా పిల్చుకుంటాం.

బాపూజీ ఎప్పుడూ ఏదోపని చేస్తోనే వుంటారు. ఒక్క నిముషమైనా పాడుచేయటం అంటే ఆయనకు యిష్టంవుండదు. ఆయన చేసే ప్రతీపని మన దేశం మేలుకోసమనే చేస్తారు.

మన దేశంలో ఎందరు ప్రజలున్నారో నీకు తెలుసా? సుమారు 40 కోట్లు కదూ? అందులో ఎందరికో కట్టడానికి గుడ్డ, తినడానికి తిండిలేకుండా వున్నారు. బాపూజీ ఎప్పుడూ వారినిగూర్చేఆలోచిస్తూ వుంటారు. వాళ్లకు ఎలాతిండి, బట్ట,

ఉండడానికి యిల్లు ఏర్పాటుచేయ గలమా అని ఆలోచిస్తూ వుంటారు.

అందుచేతనే ఆయన చేత్తో వడికినసూలు, చేత్తోనేసిన బట్ట ఉపయోగించమన్నారు. ఖద్దరంటే మనం తీసినసూలుతో నేయించు కున్న బట్టఅని నీకు తెలుసునుకదా! ఖద్దరు కట్టుకొనుటద్వారా యీ బీదవాళ్లందరకూ ఒక పూటైనా తిండి వస్తుందంటారాయన. మరి నువ్వు ఖద్దరు కట్టుకుంటూ, బీద వాళ్లకు సాయం చేస్తావా, బాలా?

గాంధీగారు మాలవాళ్లను కూడా మనలో కలుపుకోవాలం టారు. వాళ్లనుచూచి అసహ్యపడి, వేరుగా వుంచకూడదంటారు. వాళ్లు మనుష్యులేగా? వాళ్లను చూచి అసహ్యపడడం నువ్వు నేర్చుకోకేం?

ఇక బాపూజీకి బాలలంటేఎంత సరదా అనుకున్నావు! మనం చిట్టి తమ్ముళ్లతోనూ, చెల్లెళ్లతోనూ ఆడుకున్నట్టు ఆయనకూడా ఆడు కుంటారు. మనతోపాటు ఆయన



కూడా కిలకిలా నవ్వుతారు. ఆనవ్వు చంటిపిల్లల నవ్వులా వుంటుంది. ఆనవ్వులో లోకాన్నంతా నాదే ననిపించే తీపిదనం కనపడుతూ వుంటుంది.

బాలా! అటువంటి బాపూజీకి దేశమంతటి తరఫునా చేయెత్తి నమస్కారంచేయడం నేర్చుకో వద్దూ! రా! జోహారులిద్దాం.

బాపూజీకి యిప్పుడు 78 ఏళ్లు అయినా దేశంకోసం ప్రతినిము షమూ పనిచేస్తుంటాడు. నువ్వు కూడా అలా దేశసేవ చేస్తావా? ఆవయసువచ్చేసరికి, నీకూ ఆ బలమూ, శక్తీ వుండేటట్టు ప్రయత్నించు.




రచయిత : కొండపల్లి వెంకటరామదాస్, తుని.

## 5-వ మజిలీ

"స్వార్థపరుడైన మనిషి కంటే జంతువే మేలు!" అని 5వ మజిలీలో చూచిన విశేషంగురించి మన బాలయ్య, తాతయ్యను వాకబు చేస్తే తాతయ్య కథ ప్రారంభం కానిస్తూన్నాడిలా!

## "చంద్రయ్యకాపు కథ"

ఓహో! బాలయ్యా! మనం బయలుదేరిన విశేషమేమిటోగాని, మనకన్నీ వింతలపై వింతలే అగపడుతూన్నాయి! సరే! అబ్బాయ్! ఇప్పటికి సుమారు కొన్నివందల ఏళ్లక్రితం, ఇప్పుడీ వింతకల్గియున్న ఈపాలం, చంద్రయ్యకాపు అనే రైతుది. అయితే ఈచంద్రయ్య ఈ గ్రామంలో వున్న రైతులలో మోతుబరీ. సుమారు ఎన్భై ఎకరాల మాగాణి కల్గియున్నవాడునూ! తనూ, తన భార్యా, హాయిగ జీవిస్తుండేవారు. అసలు చంద్రయ్య చాల మంచివాడు. తను ఆ ఊళ్లోకల్లా గొప్పరైతైనప్పటికి కోసినా మనిషిలో గర్వంగాని, ఇతరులంటే అసహ్యంగాని కన్పించేవికావు. ఎవరికే అదను వచ్చినా ఇంతో అంతో డబ్బుసదుపాయం చేస్తూండేవాడు. ఎవరింట్లో అయినా, ఏశుభకార్యాలన్నా జరిగినాయంటే, చక్కగా తనకు తోచినట్లుగ, ఆదుకొంటూండేవాడు. పైగా, తనకు, వ్యవసాయంలోవున్న ఆపాన్లు తెలుసును కనుక తనస్వంత ఖర్చుతో నూతులూ వగైరాలు తీయించి, తోటి రైతులకి సదుపాయాలు అవీ చేస్తూండేవాడు. ఎవరికే అవసర మొచ్చినా, మనకాపు నాశ్ర

యించటం, అతనిద్వారా నెర వేర్చుకోవటం, ఈ విధంగా చంద్రయ్యాకాపు చాల మందికి స్నేహితుడయ్యాడు.

అన్నిటికంటె, చంద్రయ్య "భీమ" అనేపేరుతో ఒకమాంచి జాతైనకుక్కని పెంచుతుండేవాడు. "భీమ" మాత్రం రాత్రింపవళ్లు అతనితో హమేషా తిరుగుతుండేది. అతను చీకట్లో పొలాని కెళ్తే, కూడా లైటును నోటితో కరిచి పట్టుకుని వెళ్తూండేది. ఏదైనా పొరుగూరు వెళ్తే, ఇంటినీ, పొలాన్ని చక్కగా కాపలా కాస్తూండేది. ఆకుక్కని ఆధారం చేసుకునే నిర్భయంగా జీవితాన్ని సాగిస్తూన్నాడు చంద్రయ్య!

అయితే ప్రతీఒక్కని జీవితంలో ఒడుదుడుకులు సహజం! రెండేళ్లు వరుసగా దురదృష్టాన్ని ముంపిడి వల్ల అసలుకే నష్టంవచ్చింది. రాజుగారి కిస్తీలు చెల్లించక పోవటం వల్ల జప్తులు హాజరయ్యాయ్! అప్పటికే దెబ్బమీద దెబ్బ తినటం మూలాన్ని, అంత చంద్రయ్య, నిరాధారు డయిపోయాడు పాపం! పోనీ, తనెంతమందికి సాయంచేయలా! అలానే తనకికూడా ఎవరైనా సహాయం చేయలేకపోతారా, అని తోచిన వారినల్లా వెళ్లి అడిగాడు. అయ్యో! పాపం అని మాట సాయంచేసే వారేగాని "పిక్క" సాయంచేసేవారు లేకపోయ్యారు. చూడుబాలయ్యా! స్వార్థపరులైన మనుషులెంతవారో!


ఇంకో గత్యంతరం లేకపోవటం వల్ల, చంద్రయ్యాకాపు 20 కాళ్ల పశువులూ రాజుగారి కిస్తుక్రింద జప్తుచేయబడ్డినై. ఇంట్లో తినటానికి ఏ ఆశాలేదు. చాల హీన స్థితిలో కొచ్చేశాడు మన చంద్రయ్య. ఇంతటి దీనావస్థలో చంద్రయ్యకు మరోపెద్దకష్టమొచ్చి పడింది. అదేమిటంటా వేమో! చంద్రయ్య ప్రాణానికి ప్రాణమల్లె పెంచుకొంటూన్న, "భీమ" పశువుల జప్తు అయిపోయిన నాటి నుండీ కన్పించటం లేదు. పోనీ! చుట్టుప్రక్క లెక్కడ్డికైనా వెళ్లిందేమో అంటే రెండుమూడు రోజు

లయినా ఇంటికి చేరలేదు ఆభీమా! అందువల్ల, కనుపించిన చోట్లల్లా వెదకి, విసిగి, దానిమీద బెంగవల్ల మంచంపట్టాడు చంద్రయ్య.

బాలయ్యా! ఇక్కడ మనం మాత్రం, తప్పడిపోయిన "భీమ" గురించి తెలుసుకోవటం అవసరం. యజమాని పశువుల జప్తు అయిపోవటం, అతను దీనావస్థలోకి ఒక్కసారి వచ్చేయటం, కళ్లారా చూచిన "భీమ" చాలా దుఃఖించింది. తనని ఇన్నాళ్లూ కన్నతండ్రిలా పెంచుతూ వచ్చిన చంద్రయ్యకు ఇలాంటికష్ట సమయంలో ఏదైనా సాహాయ్యంచేసి అతన్ని కొంతకష్టాల్లోంచి తప్పించకపోతే, తనజాతి కంతాచెడ్డపేరు తెచ్చుకోవటం నిజం అని విశ్వాసమైన ఆ భీమ ఆలోచించి ఓనిశ్చయానికొచ్చి, చంద్రయ్యకు తగిన న్యాయం తనవల్ల లభించనంతవరకు అతని ఇంటిముఖం చూడకూడదనుకుని, అతనితో చెప్పకుండా ఇల్లువిడిచి ఎక్కడికో పోయింది.

అలా కొండలూ అడవులూ ఎన్నో దాటి చివరికి ఓరాజుగారి రాజ్యంచేరుకొంది "భీమ". బాలయ్యా! ఇంకోతమాషా. "భీమ" మెల్లగా ఎలాగో, ఆరాజుగారి కుక్కలతో స్నేహం కలిపింది. వాటితో తనొచ్చిన పనిగురించి తెల్పింది. అవన్నీ కూడా, భీమనెంతో మెచ్చుకొన్నాయి. ఎలాగైనా, ఈ విషయంలో భీమకి తోడ్పడి తమజాతికి పరువు నిలబెట్టాలని అవన్నీ కలసి ఓనిశ్చయాని కొచ్చేశాయ్!

ఆశ్చర్యం! ఆమరుచటి రోజునే ఆరాజుగారి దివాణంలోనూ, ప్రజల్లోనూ, ఇవేమాటలు: ఏదో ఒక చిన్నకుక్క క్రొత్తగావచ్చి, ఆరాజుగారి కుక్కలలో చేరిందనీ, అది అలాచేరి రెండు రోజులయినా అయిందో లేదోకాని, అది ఉద్యానవనంలో, బంతాట ఆడుకొంటూన్న రాజుగారి ఒక్కగాని ఒక్క కొడుకు బంతికోసమని, అక్కడ వున్న జలాశయంలో పడిపోతే, తీసి రక్షించిందనీ క్రొత్తగా దేవత



వలె వచ్చి, తనకొడుకు ప్రాణాలు రక్షించినందుకు, రాజుగారు, పెద్ద సభచేయ బోతున్నారనీ, అందులో ఆకుక్క ఇష్టప్రకారం బహుమతి చేస్తారనీ!


బాలయ్యా! మొత్తంమీద ఆ రోజు సభలో చాలామంది ఈవింత చూడటాన్కి పోగడ్డారు. అందరి ఎదుటా ఆరాజుగారు భీమ నెంతో పొగిడి తనిష్టమొచ్చినది కోరమని అడిగితే, భీమ తనంత ఘనకార్యం అసలు ఎవరి కోసమై చేయవలసి వచ్చిందో చెప్పి నీచావస్థలో వున్న తన యజమానిని ఉద్ధరిస్తే, తనని బహూకరించినట్లుగా ఎంచుకొంటాననని స్పష్టంగా చెప్పేసింది. అన్ని జంతువుయొక్క విశ్వాసానికిఆరాజేకాక,అక్కడున్న సభవారంతా ఆశ్చర్యపడిపోయారు. "భీమ" నెంతో మెచ్చుకొన్నారు. అప్పుడు ఆ రాజుగారు భీమను తన ఒడిలోకి తీసుకుని ఇలా అన్నారు. "ఓచిన్నిభీమా! నీవిశ్వాసానికి నాకెంతో సంతోషమైంది. ఇదిగో! నీయజమానికి ఓవందకాళ్ల పశువులూ ఓ 50 కంబార్లూ నీతో కూడా పంపిస్తూన్నా. అదికాక, నీపోషణకై ఏటేటా 100 రూ॥అదనంగా మీయజమానికి మాదివాణంనుంచి వచ్చేలా ఆజ్ఞాపత్ర మిస్తూన్నా. నీవుమాత్రం అప్పుడప్పుడు వస్తూబోతూ వుండాలి.

ఇహ! మన "భీమ" రాజుగారి దగ్గఱ మన్ననతో శెలవు పుచ్చుకుని, తనకి సాయపడిన తోటిబంధు

వులను కలుసుకొని అవితనకి చేసిన సహాయానికి, వాటికి తనెప్పుడూ కృతజ్ఞుడననీ చెప్పి, ఆ రాజుగా రిచ్చిన పరివారం అంతతోనూ, అంచీలమీద బయలుదేరి, కృంగి కృశించి పోతూన్న తనయజమా నిని చేరింది భీమా!

భీమ తెచ్చిన వాటికంటే, భీమను చూడటంతోటే, చంద్రయ్యకు ప్రాణం లేచివచ్చింది. కొద్దిరో జుల్లో తేరుకుని, భీమ ప్రోత్సాహం వల్ల వ్యవసాయం ప్రారంభించాడు. అదృష్టాన పంటలు వెంటనే కల్సు కొచ్చాయ్! రాజుగారి దివాణా నికి, మాటప్రకారం భీమవెళ్తూ వస్తూవుండేది. వెళ్లినప్పుడల్లా, తన తోటి బంధువులను కూడా చూస్తూండేది. చంద్రయ్యకావు స్నేహితులు, మళ్లా చేరబోయారు కాని, అతను ఈసారి చేరనివ్వలేదు. పైగా వాళ్లందఱకి బుద్ధివచ్చేట్టు తనపొలంలో, ఓ పెద్ద అరుగు కట్టించి దానిమీద ఒకకుక్కకు ఓమనిషి దండం పెట్టున్నట్లుగ చెక్కించి, దానిమీద ఇలా వ్రాయించాడు.

"స్వార్థపరుడైన మనుష్యుని కంటె జంతువేమేలు." ఇందులో వున్న విశేషం ఇది అని తాతయ్య కథ ముగించగా బాలయ్య హుషా రుగా, మరోమజిలి చేయటాని తయారులు చేస్తూన్నాడు. మరో మజిలీలో...మరోగమ్మత్తు! ఏం!



## మాటమజా

తాతా! ఏం తెచ్చావు?
పరికిణీలు
ఏం పరికిణీలు?
పట్టు పరికిణీలు
ఏం పట్టు?
కాశీ పట్టు
ఏం కాశీ?
దక్షిణ కాశీ
ఏం దక్షిణం?
ప్రదక్షిణం
ఏం ప్రదక్షిణం?
గిరి ప్రదక్షిణం
ఏం గిరి?
చంద్రగిరి
ఏం చంద్ర?
హరిశ్చంద్ర
ఏం హరి?
భర్తృహరి
ఏం భర్త?
నీ భర్త
ఆఁ! నీభర్తే!


సంపాదన:
చె. శ్రీ. వెంకటరామయ్య

## వీపుమీద!

బాలగా డొకనాడు
బీడీలు కాల్చగా
పిల్లలందరు పోయి
ఇంట జెప్ప
తల్లి దండ్రులు వాని
తీసుకొనివచ్చి
దబదబా వేసిరి
వీపుమీద?

రచన: కాజా వెంకట ప్రసాదరావు
(తెనాలి)

## ఆదో ప్రపంచం!



ఈ చిట్టిబాల ఎవరో తెలుసా?
చి॥ నిమ్మగడ్డ కళ్యాణం.

# టక్కరి గబ్బిలం



రచన: నాగవోలు వెంకట అప్పారావు.

పక్షులు మృగములు
కక్షలు పెంచి
ఘోరయుద్ధమున
పోరుచుండినవి.
పక్షులు ముక్కుల
పశువుల పొడుచుచు
కాళ్లతో తలల
గొట్టుచు నుండగ
దొరికిన పులుగుల
కోరికి చంపుచును
మృగములు యుద్ధము
మిగుల రోషమున
చేయుచునుండెను
జయమునకై.

♦ ♦ ♦

జాతుల రెంటికి
చెందు గబ్బిలము
పక్షు లోడితే
పశువుల జేరగ
పశువు లోడితే
పక్షుల జేరగ
ఎటుజయముండునో
అటు చేరుటకై
హద్దు గోడపయి
ముద్దు పిల్లివలె
కుటిల బుద్ధితో
కులుకుచు నుండెను.

♦ ♦ ♦

పక్షు లొకప్పుడు
పశువు లొకప్పుడు
జయించు నట్టుల
క్షణ మొక మాదిరి
ఘడియొక మాదిరి
కనబడుచుండగ
తుదకా యుద్ధము
తీవ్రమయ్యెను.
కడపట మృగములు
గెలిచే సూచన

కానుపింపగా
కేరుచు మృగముల
చేరి యిట్లనియె
చాల చెలిమితో

◆ ◆ ◆

"మిత్రులార నే
మీజాతీయుడ
శత్రువివరములు
చెప్పుచు నుందును
పశువుల వలనే
పిల్లలగని చను
బాలతోడ నా
పిల్లల బెంతును;
పశువులకునువలె
పండ్లు నోటిలో
పుట్టెను అవియా
పక్షుల కేవీ?
పక్షుల వలె నా
పక్షములేవి?
జంతువులకు వలె
చర్మమేగాని
ఎక్కడ నైనను
రెక్కల కైనను
యీాకలు గలవా?
యీా తెర గెరుగుడు
నను స్వజాతిలో
నుండగ నీయుడు"
అని యాటక్కరి
యనగ మృగాలును
అనుమానించక
అనుమతించినవి.
కాని మరునాడు
ఘోరమృగాలే
గెలిచే సూచన
గోలుపోవగా
పక్షుల జేరగ
బోయి గబ్బిలము
అతి వినయముగా
అచట నిట్లనియె.
"సఖియలార నా
స్నేహితులారా
చెట్లపైననే
చెలగే పక్షిని
నీతిని తిరిగెడు
నెలతనుగానా
జాతికి చెందిన
చెలియనుగానా
పక్షములుగలుగు


పక్షినిగానా
స్వాగతమీయగ
తగనిదానా."
కాని, పక్షులా
గబ్బిలమును తమ
జాతి చేరుటకు
నీతిముఖ్యమని
సరసముతోడనె
సాగనంపినవి.

♦ ♦ ♦

ఆమరునాడే
ఆగెను యుద్ధము
సంధికుదరగా
సరదాగా యవి
విందు చేసుకొని
వినోదించుటకు
జాతులు రెండును
చెలిమి తోడుతను
వరుసతీర్చి తమ
వరుసల వంతున
ఆటలనెన్నో ఆడినవి
పాటలనెన్నో పాడినవి.
ఆవిందునకై ఆగబ్బిలము
పక్షుల వరుసను
పాల్గొన బోవగ
నీవా? పక్షివి
కావేకావని
పొమ్మొమ్మవలకని
పక్షులుకినిసెను.
జంతువరుసలో
చేరగ బోవగ
నీవు మృగానివి
కావేకావని
పొమ్మొమ్మవలకని
పొడిచె మృగాలు.

♦ ♦ ♦

నాటినుండియును
నేటికి కూడను
పదుగురిలో తను
పరిభవ పడుటచే
పగలల్లా యే
పాడింట్లోనో
చీకటి గుహానో
సిగ్గున దాగొని
చీకటి పడగా
సన్నసన్నగా
దొంగచందమున
దారినితీయును.
చీకటియందే-
విహరించున్మరి
వెలుతురు అంటే
వెరపుచెందును!




## శ్రీనగరము

మన దేశపు వుత్తరభాగంలో, 'కాశ్మీర్' అనే పేరుతో చాలా అందమైన దేశమొకటుంది. ఆ దేశంలో ఎక్కడచూచినా తెల్లటి మంచుకొండలు, ఆకొండలమధ్య ప్రవహించే నదులు, కాలువలు, చెరువులు, సరస్సులు, తోటలు, రంగు రంగుల పూలు, పండ్లు, యిలాంటివే కనిపిస్తాయి. ఆనదుల మీద, సరస్సులమీద ఎప్పుడూ పడవలు తిరుగుతూంటాయి. ఆ దేశంలో చాలామంది పడవల మీదనే యిండ్లుకట్టుకొని నీళ్ల మీదనే నివసిస్తారు. కొత్తవాళ్లెవరైనా కాశ్మీరుకెళ్లితే కొంత కాలం హాయిగా ఆపడవలమీదే రాత్రింబవళ్లు పొద్దుపుచ్చుతారు.

కాశ్మీర్ కొండలమధ్య నుంది కాబట్టి అక్కడికి రైళ్లు ఎక్కువగా వెళ్లవు. అయితే ఆకొండల మధ్యనే వంకరరోడ్లు చాలా వున్నాయి. ఆరోడ్లమీద మోటారులో ప్రయాణం చేస్తారు. మోటారులో ప్రయాణం చేస్తూంటే కాశ్మీర్‌లోని నదులు, చెరువులు తోటలు, అన్నీమనకు కనిపిస్తాయి. ఇలాగే కాశ్మీర్‌లో చాలా వింతలున్నాయి.

ఇల్లాంటి అందమైన కాశ్మీర్ దేశాన్ని పూర్వకాలంలో ప్రవరసేనుడనేరాజు పరిపాలించేవాడు. ఆ ప్రవరసేనుడు ఒక పట్టణాన్ని కట్టించి దానికి 'సూర్యనగరం'అని పేరుపెట్టాడు. కాశ్మీరు ఎంతఅంద

మైనదో సూర్యనగరంకూడా అంతటి అందమైన పట్టణమే!

కొంతకాలానికి సూర్యనగరం చాలా గొప్పపట్టణమైంది. కాని ఆవూళ్లో నివసించేవారి కాపేరు నచ్చలేదు. వెంటనే పాత పేరు మార్చేసి 'శ్రీనగరము' అని కొత్తపేరు పెట్టారు.

ఈ కాశ్మీరు దేశం కూడా మైసూరులాగే ఒక పెద్దసంస్థానం. శ్రీనగరం దానికి ముఖ్యపట్టణము. రాజుగారీ శ్రీనగరంలోనే నివసిస్తారు.

శ్రీనగరం అన్నినగరాల్లాగా వుండదు. నగరానికి మధ్యగా 'జీలం' నది ప్రవహిస్తూంది. ఆనదికి రెండువైపుల కొయ్యతో చాలా అందగాకట్టిన మేడలున్నాయి. ఆమేడలమీద రంగు రంగుల పూలతీగెలు గజిబిజిగా అల్లుకొని ఉంటాయి. మరొకతమాషా ఏమిటంటే యీవూళ్లో మన వూళ్లలాగా రోడ్లు చాలాతక్కువ. ఆవూళ్లోకంతా పెద్దరోడ్డు జీలంనది. బజారుకెళ్లాలంటే పడవలెక్కి నదిమీద వెళ్లాలి. అందుకే జీలంనదిమీద పడవలెప్పుడు అరుగుతూంటాయి.

ఇతర నగరాలలో రాజుల్లాగా శ్రీనగరంలోని రాజు ఏనుగులమీద, మోటార్లమీద వెళ్లడు. పడవలెక్కి వెళ్తాడు. రాజుగారెప్పుడైనా నదిమీద షికారువెళ్లితే ఆయనకు తోడుగా రంగురంగుల పడవలెన్నో నదిమీద వెళ్తాయి. అదొక వుత్సవంలాగుంటుంది. ఆవుత్సవం చూడాలని నదిఒడ్డున మేడలమీద చాలామంది గుంపులు గుంపులుగా నిల్చుని చూస్తుంటారు.

శ్రీనగరానికి దగ్గరగా పెద్ద సరస్సు ఒకటుంది. దాని పేరు 'డాల్' సరస్సు. ఆసరస్సు ఒడ్డున పూర్వంరాజులు వేయించిన చక్కనితోటలు చాలావున్నాయి. షికారుగా చెరువుమీద వెళ్లడానికి, భోజనం చెయ్యడానికి, నిద్రపోవడానికి వీలుగావుండే పడవలు యీసరస్సులో చాలా వున్నాయి. వేసవికాలంలో ఆపడవలమీద సరదాగా కాలంగడపడానికి విదేశాలనుంచి దొరలు కూడా వస్తారు.

ఈ సరస్సులో పడవలమీద వెళ్తూంటే అక్కడక్కడ చిన్న తెప్పలు కనిపిస్తాయి. వాటిమీద మనుష్యులుంటారు. అయితే వాళ్లేంజేస్తారో తెలుసా! ఆ తెప్పల మీద పండ్లచెట్లు, కూరగాయల చెట్లు పూలమొక్కలువేసి పెంచుతారు. అవి చిన్నచిన్న తోటలు. ఆతోటల్లో పుచ్చకాయలు, టొమాటో పండ్లు యింకా యిలాంటివెన్నో రకరకాల పండ్లు కాయలు కాస్తాయి. ఈ తోట లెప్పుడూ ఒకేచోట వుండవు. ఒక మూలనుంచి యింకోమూలకు తిరుగుతూంటాయి. ఇలాంటి తోటలు ప్రపంచంలో ఎక్కడలేవు.

శ్రీనగరంలో రకరకాలపండ్లు కావలసినన్ని దొరుకుతాయి. ఎప్పుడూ పండ్లు తినాలనుకునే వాళ్లు అక్కడికెళ్లి తిరిగి ఇంటికి రాకుండా పండ్లు తింటూ కూర్చోవచ్చు. మంచుకొండల మధ్యనే వుంది కాబట్టి శ్రీనగరం ముఖ్యంగా వేసవికాలంలో చల్లగా వుంటుంది. అప్పుడు శ్రీనగరానికి వెళ్లితే హాయిగా పండ్లుతింటూ సుఖంగా కాలంగడపవచ్చు. పోనీ ఒకసారి వెళ్లి పండ్లుతినిరండి!


## జాబ్కో వస్తువులు

అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి -సబ్బులు నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్కోవారే తయారు చేస్తున్నారు. మీరు స్వదేశీ వస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్కో మార్కుగల వస్తువులే, అన్నిటికంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీవే కొనుడు. జాబ్కోనే కొనుడు.

★

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హేర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

★

## జయభారతం కంపెనీ

మదరాసు-బెంగళూరు-ఎర్ణాకులం.

# గగర రగర భాష

బాగర లగర నుగురు చగర దిగిరి వేగరే
పిగిరి ల్లగర లూగురూ! మీగిరీ కుగురు ఈగిరి
భాగర షగర వగర చ్చుగురు నాగరా?
ఈగిరీ భాగర షగర వగర స్తేగరే
బగర లేగరే తగర మాగరా షాగరా గాగరా
ఫుంగురుం టుంగురుం దిగిరి.

రగర చగర నగర: రొగొరొ మ్మగర రాగరా జుగురు
జగర యగర లగర క్ష్మిగిరి,
నాగరా మగర గిగిరి రిగిరి, (వొంగొరొం గోగోరో లుగురు)





## బిటాకేఫిన్

(తలనొప్పి బిళ్లలు)

అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1 అణా.**

స్టాకిస్టులు: దాదా అండ్ కంపెనీ, పి. టి., మద్రాసు.

అన్ని చోట్ల దొరకును.


*Stockists* :—M/S DADHA & CO P. T. MADRAS.
*Manufactured by*—**BOMBAY TABLET MANUFACTURING CO.,**
Post Box No 2092, BOMBAY 2.

# స్నేహం అంటే ఇది

బాలా!

మన దేశంలో హిందువులు, మహమ్మదీయులు, శిక్కులు ఇంకా ఎన్నో మతములవా రున్నారు. అందులో ఎక్కువమంది హిందువులే. మహమ్మదీయులుకూడా ఉత్తర హిందూదేశంలో అక్కడక్కడ జాస్తిగానే వున్నారు.

ఇప్పుడు ఏమి జరుగుతుందో తెలుసా? ఇన్ని సంవత్సరాలై మన రాజ్యం ఏలుతున్న తెల్లదొరలు (బ్రిటిషువారు) ఇప్పుడు మన రాజ్యం మనకి ఇచ్చేస్తున్నారు. కాని, మనలో మనకి తగవులువచ్చి, మహమ్మదీయులు మనతో కలిసి రాజ్యం చేయమంటున్నారు. చూచారా! మన ఐకమత్యం ఎలాగుందో!




స్నేహం, ఐకమత్యం, ఎలాగుండాలో యీ బొమ్మలో మన చిత్రకారుడు పి. రామారావు రాశాడు. చూడండి.

---

**తెలుసా**

ఒచ్చేనెల 'బాల' పుట్టింరోజు పండగ. మిఠాయిసంచిక వస్తోంది. చాలా మంచి కథలూ బొమ్మలూ వుంటాయి. మీరు తప్పకుండా చదవాలి. 150 పేజీలు! వెల ఒకరూపాయి మాత్రమే. రిజిస్టరు పోస్టు 0-3-0 ప్రత్యేకం.




# భీష్మ గొబ్బి

ఉత్తరగోగ్రహణం అయింతర్వాత పాండవులు కొన్నాళ్ళదాకా భారతయుద్ధం ఆరంభించలేదు. అంతవరకూ కౌరవులవైపునుంచీ పాండవులవైపునుంచీ చుట్టాలు ఒకరొకరు చూచుకోటానికి ఒకరిచోటికింకోరు వస్తూపోతూనే వున్నారు.

తన ప్రియబంధువుడైన అర్జునుడే గొబ్బి అనే యువతిచే పరాభవింపబడ్డాడని విన్న వెంటనే భీష్మాచార్యులవారు పాండవులను చూడడానికి వచ్చారు.

గొబ్బిని చూడంగానే భీష్మాచార్యులు గ్రహించాడు "ఈమె ఆదిశక్తి అంశజురాలు. ఇంకేం, పాండవుల అదృష్టం పండింది!" అనుకున్నాడు.

భీష్మాచార్యుల ప్రతిభా, ప్రతాపం, ప్రాజ్ఞతా గొబ్బి యీవరకే విన్నదిగావున ఆయనను చూడంగానే నమస్కరించింది.

నమస్కరించి ఎదుటనిలబడిన గొబ్బిని పరామర్శ చేశాడు భీష్ముడు. ఆమెలోని సత్కళను చూచి సంతోషించాడు. ఆమె యందలి చిత్కళనుగాంచి చైతన్యపడ్డాడు. ఆమె నావరించియున్న ఆనందకళను వీక్షించి విడ్డూరపోయాడు.

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావు

భీష్ముడు మనసులో అనుకున్నాడు "ఈ

పడుచు నాకు రథసారథియైతే యెంత బాగుండును!"

భీష్ముడు మనస్సులోనిమాట మనస్సులో దాగలేదు. హాస్యాస్యాపి మాటలాడుతూన్నప్పుడు బైటికే అనేశాడు.

ఆమాటకు గొబ్బి సంతోషించి "అర్జునుని సారథి కృష్ణుడు కదూ! కృష్ణుడేమో మహా తన కన్న సారథ్యంలో నిపుణులు లేరనుకుంటున్నాడు. ఇదే మంచి సమయం. ఈ తాతకు సారథి నౌతాను. ఎట్లాగో యుద్ధం వచ్చేట్లుంది." అనుకుంది గొబ్బి.

ఈమాటవిన్న వుత్తరునికి బాణపు ఫుల్లతో పళ్లుతోముకున్నట్లనిపించింది. "ఛీ. నీకు యుద్ధమేమిటి నీమొఖం, అందులోనూ ఆ వృద్ధవీరునికి సారథ్యమా! బహుశా అయన యెదుటి పక్షంలో వుండిపోతాడు, గ్రహించావా?" అన్నాడు.

ఈ సందడంతా చూస్తూ వింటూన్న కృష్ణునికి ఓగొప్ప ఆలోచన తోచింది. ముందు ముందెట్లాగో యుద్ధంలో భీష్ముని ఓడించడానికి అర్జునుడు అంబను ముందుపెట్టుకో వాలిసొస్తుంది. ఆడదాన్ని ముందుపెట్టుకుని గెలిచాడనే అప్రతిష్ట అర్జునునికి లేకుండా వుండాలంటే, భీష్మునికి ఆడది సారథిఅవడం మహామేలు. అందుకని ఉత్తరుని దగ్గరకు తీసుకుని భార్యకుపేరు ప్రఖ్యాతులు రావడం భర్తకే నయంకదా అని ఎన్నోరీతుల చెప్పి వొప్పించాడు.

"సరే పోనీ గొబ్బి భీష్మునికి సారథ్యంచేస్తే నాకు చూడాలని వుంది. నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు ఉత్తరుడు.

"నువ్వా? ఇంట్లోవుండి విరిగిన విల్లంబులకు అతుకులు పెడుతూ వుండు" అన్నాడు బావమరది అభిమన్యుడు.

ఆ నిముషంమాత్రం గొబ్బి అక్కడలేదు. అందరూ నవ్వారు.

"అయితే గొబ్బిని తీసుకుపోకుండా చేస్తాను. మేమిద్దరం మావూళ్లోనే వుంటాం." అన్నాడుత్తరుడు.

"ఓహోహో అలాకాదు. నా వెనక కూర్చుని నాకు బాణాలం దిస్తూండు. వీరునికి వీరుడే అం దియ్యాలి" అన్నాడర్జునుడు.

"ఆఁ! అదింకా బాగుంది!" అనిఊరడిల్లాడు ఉత్తరుడు.

అనుకుం టుండంగా రానే వచ్చింది యుద్ధం.

ఆదిలోనే కౌరవసైన్యానికి ఆధిపత్యం వహించాడు భీష్ముడు. భీష్ముని రధానికి సారధ్యం వహిం చింది గొబ్బి.

నక్కజిత్తులతో కృష్ణుడు అర్జు నుని రధంతోలుతూంటే కుందేలు వలె కుప్పిగంతులు వేయిస్తూ గొబ్బి భీష్ముని రధంతోలింది.

సరోవరంలోని హంసల్లే కృష్ణుడు అర్జునుని రధాన్ని మెల్లిగా నడిపినప్పుడు వనవిహారంచేస్తోన్న నెమలివలె గొబ్బి భీష్ముని రధాన్ని నడిపింది.

గాలిలోని డేగవలె కృష్ణుడు రధాన్ని రయ్యిమని పించినప్పుడు నీటిలోని చేపవలే గొబ్బి రధాన్ని జుయ్యిమని పించింది.

ఇంతకు ఈ ఇద్దరు సారధ్యాల కౌశల ప్రదర్శనాలమధ్యా భీష్ముని బాణాలకు అర్జునుని ప్రాణాలు అవిసిపోతున్నాయి.

బలె బలే అని హర్షిస్తున్న ఉత్తరుని డొక్కలు రొవ్వు తూన్నాయి.

యుద్ధరంగానికిపైన ఆకాశంలో గరుత్మంతునిపైన స్వారి చేస్తూ చూస్తూన్న రుక్మిణీ సత్యభామలు చప్పట్లుకొడుతూ కృష్ణుని గేలి చేశారు. "అమ్మామ్మపిల్లా! మన గొబ్బేనమ్మా! ద్వారక విడిచి యెక్కడకో పోయిందనుకున్నాం. జాణ సుమా!" అనుకున్నారు రుక్మిణీ సత్యభామలు.

కృష్ణునికి రోషం హెచ్చిపో తోంది. ఈ చతురహాస్యాన్ని ఛప్పున నిలిపే యాలనున్నాడు. అంబను తెచ్చాడు.

అంబ చాటునుంచి అర్జునుడు బాణాలు కురిపింపగా భీష్ముడు రధంపైన ఒరిగాడు. ఆయన్ను అదివరకే సిద్ధమెయున్న అంప శయ్యమీద పరుండపెట్టారు.

చూడడానికి చుట్టాలంతావచ్చారు. నలుగురిలో 'నల్లనివాడు' గూడా వున్నాడు.

అన్యాయ యుద్ధానికి అలుక చెందింది గొబ్బి. భీష్మనిర్యాణం వరకూ ఆయనకు సేవచేస్తూ ఉండి ఇంటికి పోనన్నది.

అక్కడున్న ప్రజలంతా గొబ్బి సేవాపరాయణత్వానికి మెచ్చుకున్నారు. ప్రజలలో ప్రజలు భీష్మనిర్యాణదినం ఏటేటా ఓవ్రత దినంగా జరుపుకుందాం అని అనుకున్నారు.

కృష్ణునికిరోషం ఇంకాతగ్గలేదు. గొబ్బిని ప్రజలాదరంగా చూడడమాతనికి చిన్నతనము వేసింది.

"భీష్మ నిర్యాణదినాన ప్రజలుపవాసముంటేనే కాని వారికి వ్రతఫలితం దక్కదు!" అన్నాడు కృష్ణుడు.

"మధ్యమధ్య మంచినీరుతాగితే పరవాలేదు. రాత్రి పదిగంటలు దాటింతర్వాత పిండిచేసుకుని తింటే అంతకన్న పరవాలేదు!" అన్నది గొబ్బి.


# రంగుల పెట్టెలు - ట్యూబులు

(సుప్రసిద్ధ "స్విన్స్లీ" వారి తయారు)



బడిపిల్లలకు - చిత్రకారులకు

★ నీటిరంగులు (Water Colours)
★ చిత్రకారుల రంగులు - పెయింట్లు
★ పోస్టరు రంగులు
★ రంగు సుద్దలు

ఈ రంగులతో మీ డ్రాయింగులను అందముగా వేయవచ్చును.

చక్కని బొమ్మలు తయారు అగును.

టోకు ధరలకు, ఏజన్సీ షరతులకు వ్రాయుడు.

సోల్ డిస్ట్రిబ్యూటర్సు: స్టేట్సు ప్రోడక్ట్సు,

12, నోబిల్ ఛాంబర్సు, పార్శీబజారు వీధి, బొంబాయి 1.

# జీతాలు! జీతాలు!!

అ ఆ — ల నేర్పించు అధ్యాపకులబాధ
అధికారవర్గంబు ఎరుగలేదు

ఇ ఈ — ల కొరకై ఇల్లిల్లు తిరిగిన
ఇంటివారికి కరుణ సుంతలేదు.

ఉ ఊ — ల నేర్పంగ ఊరూరుమార్చిన
ఉప్పిడి బియ్యంబు తప్పలేదు

ఋ ౠ — ల దిద్దించి రూఢియొనర్చిన
ఋణము చేయుటమాకు తప్పలేదు

ఌ ౡ — ల వ్రాయించి లోకంబు తిరిగిన
లాభమేమియు మాకు కలుగలేదు

ఎ ఏ — ల కొరకై ఏటేట పోరాడ
ఐదు రూకలెగాని అధికంబులేదు

ఒ ఓ — యనుచు మేము ఓపికతోనున్న
ఔ ర — జేసితిరిక మాకు అన్నిసున్న
అం — ద రెన్నెన్ని చెప్పిన యాలకించి
అః — జేసితిరిక ఎన్‌హ్యాన్సు స్కేలు నొకటి!

రచన: యం. వి. నారాయణయ్య (మాచినాయకనపల్లి)





# అంకెల తమాషా



సంపాదన: మంచికంటి ప్రభాకరరావు (కాకినాడ)

బాలా! రు. అ. పై. లో నీయిష్టము వచ్చిన సంఖ్యలు వేయుము. అయితే రూపాయిలసంఖ్య 12 కు లోవుగా నుండవలెను. పైసలసంఖ్య రూపాయిలసంఖ్యకు తక్కువగా నుండవలెను. రు. 6-14-4 అను కొందము. దానినే త్రిప్పి వ్రాసిన 4-14-6 అగును. ఇప్పుడు రు. 6-14-4 లో నుండి రు. 4-14-6 తీసివేయుము. రు. 1-15-10 మిగులును. ఆ మిగిలినదానిని మరల త్రిప్పి వ్రాయగా రు. 10-15-1 అగును. ఈ రెండింటిని కలుపగా రు. 12-14-11 వచ్చును.

ఈ ప్రకారము ఎన్ని విధముల లెక్కలు వేసినను జవాబు రు. 12-14-11 మాత్రమే వచ్చును. ఉదాహరణ:—

| రు | అ | పై |
|---|---|---|
| 6 | 14 | 4 |
| 4 | 14 | 6 |
| 1 | 15 | 10 |
| 10 | 15 | 1 |
| 12 | 14 | 11 |


| రు | అ | పై |
|---|---|---|
| 11 | 1 | 8 |
| 8 | 1 | 11 |
| 2 | 15 | 9 |
| 9 | 15 | 2 |
| 12 | 14 | 11 |

| రు | అ | పై |
|---|---|---|
| 3 | 6 | 2 |
| 2 | 6 | 3 |
| 0 | 15 | 11 |
| 11 | 15 | 0 |
| 12 | 14 | 11 |

| రు | అ | పై |
|---|---|---|
| 1 | 0 | 0 |
| 0 | 0 | 1 |
| 0 | 15 | 11 |
| 11 | 15 | 0 |
| 12 | 14 | 11 |

ఈ తమాషా గ్రహించారా లేదా?






కానన్ ష్మిడ్ కు
వేలూరి శివరామశాస్త్రి
అనుసరణం

# ఇంటికోడి

పని పాటులలో చాలా మెలకువ కల ఒక ముసలియిల్లాలు ప్రతిరోజూ తెల్లవారు జామునే కొక్కురోకో అని కోడికూయంగానే దాసీవాళ్లను పనులు చేయడానికి లేపేసేది.

దాసీవాళ్లు కోపం పట్టలేక "ఈ పాడుకోడి గనుక లేకుండా పోతే మనమింకా కాసేపు సుఖంగా నిద్రపోతాం" అని తమలో తామనుకుని ఆ కోడిని కాస్తా గుటుక్కు మనిపించారు.

ఇంట్లో కోడి లేకుండా పోయినందువల్ల ఆ ముసలిదాని కిప్పుడు పొద్దు తెలియకుండా పోయింది. ముసలివాండ్ల కసలు నిద్రతక్కువ. ఆమె కిప్పుడు రెండు గంటలకల్లా మెలకువ వస్తూంది. మెలకువ రావడమే తరువాయిగా దాసీలను లేపేస్తూంది. వెనుక మూడుగంటలకు లేచేవాళ్లు ఇప్పుడు రెండు గంటలకే లేవవలసి వచ్చారు.

కొలంది చెట్టునఁ జావు కోరుచో 'ముల్లు తీసి కొఱ్ఱడచిన తీర'యి చెల్లు

★

# అడవికోడి

అడవిదగ్గర పొలంలో వరి తుక్కుకింద ఒక అడవికోడి చాటుగా గుడ్లు పొదుగుతూంది. అది రామిరెడ్డి తేలారెడ్డి అనే యిద్దరన్నదమ్ముల కంటఁబడ్డది. వారిద్దరూ ఏలాగయితేనేం దాన్ని పట్టుకున్నారు.

"గుడ్లయితేనేం కోడయితే నేం? కోడి నాకు, గుడ్లు నీకు" అని రామిరెడ్డి అన్నాడు.

"ఎలాగయితే నేమయితే, కోడే నాది. గుడ్లే నీవి" అని తేలారెడ్డి అన్నాడు.

ఈ రీతిగా పంపకం తెగలేదు. ఒకరి జుట్టు ఒకరు పట్టుకున్నారు, లాక్కున్నారు. తోసుకున్నారు. ఈ యుద్ధంలో పెద్దవాడి చేతి లోంచి కోడి తప్పించుకోపోయింది. వాళ్లు అటూ ఇటూ తోసుకోవ డంలో చిన్నవాడి కాళ్లకింద పడి గుడ్లు పిసరు వెళ్లినై.

కోడిదారిని కోడి పోయింది, గుడ్లదారిని గుడ్లు పోయినై, ఇక పోట్లాట దేనికి?

అప్పుడు వాళ్లిద్దరూ మన నాయన ఇలా చెబుతూవుండేవా డని ఈ పద్యం గుర్తు తెచ్చు కున్నారు.

ఉమ్మడి సొత్తు నేర్పుగఁ బంచుకొనుఁడు
జగడంబు రాకుండ జాగ్రత్త గొనుఁడు

★

# సంగీతపు పిట్టలు

దక్షిణదేశంలో ఒక చక్కని పల్లెటూరుంది. దాని చుట్టూ తోటలూ దొడ్లూ ఉన్నై. తోటల నిండా దొడ్లనిండాపండ్లచెట్లుఉన్నై. పూతకాలంలో కమ్మని పరిమళం అంతటా వ్యాపించేది. ఆ చెట్ల కొమ్మలమీదా కట్టవ పొదల లోనూ ఒకజాతి పిట్టలువచ్చి కూ చుని గూండ్లుపెట్టినై. అవిపాడడం మొదలుపెట్టగానే పనులు మానేసి అందరూ చెవులు దొరబెట్టుకుని వింటూ వుండేవారు.

వసంతం ముదరటంతో ఏ చెట్లన్నీ పండ్లతో వంగిపోయినై. కొందరు పోకిరీ పిల్లలు ఆ పిట్టలను పట్టుకుని పొట్టను పెట్టుకోవడం నేర్చారు. నాటినుండీ ఆ పిట్టలు మెల్లమెల్లగా దయలేని ఆదేశం నుండిలేచిపోవడంమొదలుపెట్టినై. ప్రభాత సంగీతం మరి వినరాలేదు.

తోటలూ దొడ్లూ మూగమొద్దు లయిపోయినై.

చీడపురుగులు, పువ్వు పూయగానే నాకేయడం మళ్లా మొదలు పెట్టినై. పిట్ట లున్నప్పుడు ఆ పురుగులను తినేసేవి. కాబట్టి అప్పుడు పూచిన పూవల్లా పండయేది. ఇప్పుడు మొండయింది. ఇదివరకు కడుపు నిండా పండ్లుతినే కుర్రాళ్లకు తమనోటిపండ్లే మిగిలినై.

అన్నింట మనకు మే లమరుచు, దాన
నెవరేని వే ల్పెట్ట నెసఁగు హైరాన.

★

# గోరువంకలు

ఒక వడ్లమరలో శచి అనే అమ్మాయీ కందర్పుడనే అబ్బాయీ పని చేస్తున్నారు. వారికి ప్రతిదినమూ చెరి ఒకసేరు నూకలు కూలి. మర యజమాని పది రోజుల కొకసారి కూలినూకలు రెండు సంచులలో పోసి వాళ్ల కిస్తూవుంటాడు. వాండ్లు ఆ సంచులను నెత్తిమీద పెట్టుకుని తీసుకుని వెళ్లి తమ తలిదండ్రుల కిస్తూవుంటారు.

మర యింటిగోడమీద రెండు గోరువంకలు జబ్బపడి మేత పెట్టేవాం డ్లెవళ్లూ లేకపోవడంవల్ల చావడానికి మొహం వాచుకున్నై. వాట్లను చూచి శచి - "మరలో, దేశదేశాలకూ సరిపోయే బియ్యం నలుగుతూందికాని యీ రెండు పిట్టలకూ పెట్టేవా రెవరూ లేరే!" అని అనుకున్నది.

పదిరోజులు కాంగానే మర యజమాని వారికి కూలినూకలు కొలిచి ఇచ్చాడు. శచి సంచిలోంచి నాలుగుగుప్పెళ్ళ నూకలు తీసి ఆ గోరువంకలకు పెట్టింది.

కందర్పుడది చూచి — ఓసి పాడుగట్టా! నూక లెందుకు తక్కువ వచ్చినై? అని నాయన నూకలు పెడితే ఏంచేస్తావ్? ఇక దెబ్బలు తినడానికి తయారుకా! అని అన్నాడు. శచి మొట్ట మొదట బిక్కమొగం పెట్టింది. కాని వెంటనే ధైర్యం తెచ్చుకుని "అన్నా! వీట్లమొహం ఎవరూ చూడరు, 'పాపం పాపం' అని అనుకుంటూ వీట్లకు నూకలు

వేయకుండా పోవడం ధర్మమా ? వాట్లమీద నాకు జాలి కలిగింది. అందువల్ల నేను చేసిన యీ పనికి నాన్న ఏమీఅనడని నాకు ధైర్యం ఉంది. ఒకవేళ కొడతాడే అంటా వ్వా; కొట్టనీ. నా చేసిన పనికి దేవుడే తోడు." అని అన్నది.

మళ్లా పదినాళ్ళు గడచినై. శచిసంచి ఇవుడు కందర్పుని సంచి కన్న రెట్టిగా ఉన్నది. కందర్పునికి దానికి కారణం తెలియలేదు. ఏమిటీ దైవసంఘటనా? అని అనుకుంటూ శచికూడా అందుకు కారణం తెలియక ఆలోచిస్తూ నిలబడ్డది.

ఇలా వాళ్ళు తటపటాయిస్తూ వుండగా లోగడ వారిమాటలన్నీ విన్న మర యజమాని వచ్చి— "శచీ! నీ జాలి గుండెకుకూడా కూలి ముట్టాలి. అందువల్ల నీసంచి పెద్ద దయింది. అందులో నూకలు నేనే పోసినా నీ గొప్ప బుద్ధి కీశ్వరుడే తోడని నమ్ము" అని అన్నాడు.

ఎవరి కుదారమౌ హృదయంబు కలదు వారికిఁ బరమేశు వలదు రాఁగలదు.


# తల్లీ — పిల్లా

పాపలు

ఎండుగాను
పీలగాను

ఎందుకు వుంటారు ?

తల్లులు బలంలేకుండా
జబ్బువారైతే

వారికి పుట్టిన పిల్లలు కూడా ఆలాగే వుంటారు.

స్త్రీల జబ్బులకు మంచి మందు ఏదంటే—

# లోధ్ర

ఈ పేరు అందరూ విన్నదే-అయినా దీనిని గురించి మీ అమ్మతో చెప్పండి.

"లోధ్ర" దొరికేచోటు:

కేసరి కుటీరము లిమిటెడ్.
రాయపేట - మదరాసు 14.

# బాలల హక్కులు

బొంబాయిలో "బాల్కన్-జి-బారీ - అఖిల్ హింద్ బాలక్ సంఘ్" అని ఒక పిల్లల సంఘం 1926 సం॥ లో పెట్టారు. ఈ సంఘం అధ్యక్షులు బొంబాయి ప్రధానమంత్రి బి. జి. ఖేర్ గారు. ఈ సంఘం మన హిందూ దేశంలోని పిల్లలందరికీ చెందినది. పిల్లలవిజ్ఞానం-వినోదం-అభివృద్ధి - కలిగించడమే యీసంఘంయొక్క ముఖ్యోద్దేశము. బాలల హక్కులు ఏమిటో యీ సంఘం ఒక హక్కులపత్రం తయారుచేసింది. హిందూ దేశములోని ప్రతి బాలబాలికలకు-

1. స్వతంత్ర దేశములో, జాతిమత భేదములచే కట్టుబడకుండా, హాయిగా అనుకూల వాతావరణం, అభివృద్ధికి అవకాశములు వుండాలి;
2. ఇంట్లో చక్కని అవకాశాలు వుండాలి; చీవాట్లు, భయం ఇవి వుండకూడదు; తలిదండ్రులు మంచి ఆహారము, బట్ట ఇచ్చి ప్రేమతో పిల్లలను పోషించాలి;
3. పాపలు పుట్టేముందూ, పుట్టిం తరువాతా - తల్లీ పిల్లకు ఆపద లేకుండా మంచి ఆరోగ్య సదుపాయాలు వుండాలి.
4. ఆరోగ్యముగా, పుష్టిగా బాగాపెరుగుటకు ప్రభుత్వమువారు, తలిదండ్రులు, బాధ్యతవహించి వైద్యసదుపాయాలు పెట్టాలి.
5. మంచి చదువు చెప్పించాలి. ఎవరికి ఎటువంటి చదువు పనికివస్తుందో, ఆటువంటి చదువే ముఖ్యంగా చెప్పించాలి. బాలలను దేశానికి పనికివచ్చేవారుగ తయారు చేయాలి.
6. ఆట పాటలకు ప్రత్యేక సదుపాయాలు, బడులు ప్రభుత్వమువారు పెట్టించాలి.
7. పెద్దల లాభంకోసం పిల్లల్ని ఉపయోగించకూడదని శాశించాలి.
8. కుంటి, గుడ్డి, వెనుకబడియున్న పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు బడులూ వుండాలి.
9. నగరములలోని పిల్లలకుగల సదుపాయములన్నీ గ్రామాల్లోని పిల్లలకుకూడా వుండాలి.

తెలుగు బాలలారా!

మీరు వెంటనే "బాల సంఘాలు"గా ఏర్పడాలి. ఇతరవివరములు కావలిస్తే వీరికి రాయండి:

కార్యదర్శి: బాల్కన్ - జి - బారీ - అఖిల్ - హింద్ - బాలక్ సంఘ్",
గులిస్థాన్, ఖార్,
బొంబాయి 21.



# పొడుపుకథలు

1

(అ) తెల్లని నెమిలికి పచ్చనితోక

(ఆ) తెల్లని టోపీలో నల్లనిదారలు

(ఇ) మానాన్న డబ్బులు ఎంచలేరు

మాఅమ్మ చీర మడవలేదు......ఏమిటి?

సంపాదన. యం. ప్రమీలారాణి (బళ్లారి)

2

తోడులేకున్న నడవలేదు

తోటిసోదరుని విడువలేదు

ధరణిదానికి జీవంబులేదు

దీనిభావమేమి చెప్పుము బాలా!

సంపాదన: టి. బుచ్చిబాబు (బారువ)

3

చిన్నప్పుడు బట్టకట్టుకొని

పెద్దదికాగానే బట్ట విప్పేస్తుంది......ఏమిటి?

4

దీన్ని దేవాలయములో ముఖ్యముగా ఉపయోగిస్తారు


ఇందులో—పెళ్లిళ్లలో ఉపయోగించేదుంది

సముద్రములో ఉండేమంది

యుద్ధముంది—అది ఏమిటి?

సంపాదన: గంద్రాపు పేర్రాజు (రాజమండ్రి)

# ఎవరికి దణ్ణం పెట్టాలి



రచన: యస్. బి. రామేశం, రాజమండ్రి

## బాలా!

ప్రొద్దున్నే చిట్టిబాల లేచింది లేచి ఏం చేసింది? లేచీ లేవడం తోటే ముఖం కడుగుకొని అమ్మ దగ్గరకు పరుగెత్తింది.

అమ్మ చూసి "చిట్టీ! అలా పరుగెత్తుకొస్తున్నా వెందుకే?" అని అడిగింది. అపుడు చిట్టిబాల చెప్పిందికదా "మేష్టారు రోజూ ప్రొద్దున్నే లేచి నీకు దణ్ణం పెట్ట మన్నారే అమ్మా!" అంది.

అపుడు అమ్మ నవ్వి, చిట్టిని ముద్దాడి "అయితే చిట్టీ! ముందు మీ నాన్నకి దణ్ణం పెట్టు మరి!" అంది.

వెంటనే చిట్టి, నాన్నగారు గది లోకి ఒక గంతేసింది. నాన్నగారు చిట్టి గంతుల్ని చూసి, "ఏమిటే చిట్టీ! ఆ హడావిడి?" అని అడిగేరు.

"మేష్టారు అమ్మకి దణ్ణం పెట్ట మన్నారు. అమ్మ మీకు దణ్ణం పెట్టమంది" అని చిట్టి చెప్పింది.

నాన్నగారు చిట్టిని ఎత్తుకొని ఆడిస్తోంటే చిట్టి మళ్ళా అడిగింది దణ్ణం పెడతానని. అపుడు నాన్న గారన్నాకరుదా, "చిట్టీ! నాకూ, అమ్మకీ దణ్ణం పెట్టబోయే ముందు నువ్వు ఇంకొకరికి దణ్ణం పెట్టాలి" అని అన్నారు.

"ఎవరికి?" అని అడిగింది చిట్టి.

"నాన్న చిట్టిబాలను ఎత్తుకొని గోడమీద వ్రేలాడుతోన్న పెద్ద పటందగ్గరకు తీసుకొని వెళ్ళేరు. చిట్టి ఆబొమ్మను చూసి,

"నాన్నా! ఈబొమ్మ ఎవరిదీ" అని అడిగింది.

"చిట్టీ ఈబొమ్మ ఎవరిదో తెలుసా? నీకూ, నాకూ, మన ఊళ్ళో ఉన్నవాళ్ళందరికీ, మన దేశంలో ఉన్నవాళ్ళందరికీ తల్లి. నువ్వు ప్రతిరోజూ ఈఅమ్మకి దణ్ణం పెట్టి, తరువాత నాకూ అమ్మకి దణ్ణం పెడుతోండు, ఈఅమ్మ పేరేమిటో తెలుసా చిట్టీ! ఈమె పేరు భారతమాత" అని నాన్న చెప్పేరు.



చిట్టీ నాన్నగారు చెప్పినవన్నీ ఊఁకొట్టి "అలాగే, నాన్నా!" అంది. చిట్టిబాల నీళ్లు పోసుకొని, చద్దిఅన్నం తినేసి పుస్తకాలు పట్టుకొని బడికి వెళ్ళింది. వెళ్ళి మేష్టారు ముందు నిల్చుంది.

'ఏం నిల్చున్నావ్, కూర్చో!' అన్నారు మేష్టారు చిట్టిబాలని.

"మీరు నన్ను ప్రొద్దున్నే లేచి మా అమ్మకు దణ్ణం పెట్టమన్నారు. అమ్మ ముందు నాన్నగారికి దణ్ణంపెట్టమంది. నాన్న భారతమాత అనే అమ్మకు ముందు దణ్ణంపెట్టమన్నారు. ఎవరికిముందు దణ్ణంపెట్టాలో నిన్న మీరు సరీగ్గా చెప్పలేదు నాకు" అని చెప్పింది చిట్టిబాల. ఆ మాటలకి బాలలంతా నవ్వేరు.

మేష్టారు నాలిక కరచుకొని, "అవునులే! మీనాన్న చెప్పినట్టే పెడుతోండు రోజూను." అని పాఠాలు చెప్పడం మొదలుపెట్టేరు.

అప్పుడు యింకో బాలలేచి అందికదా, "మేష్టారూ, భారతమాతబొమ్మ మా యింట్లోనూ ఉంది" అంది.

'అదిఅందరిళ్లలోనూ ఉండాలి.' అన్నారు మేష్టారు.

అప్పుడింకో పొట్టిబాల 'ఏమండీ! మేష్టారూ? అటువంటి బొమ్మ మీఇంట్లో ఉందా?" అని అడిగింది.

ఆ ప్రశ్న వినగానే మేష్టారికి గుటకపడలేదు.

అప్పుడింకో వీరబాల లేచి "మనబడిలో అటువంటి బొమ్మ ఒకటిఉంటే బలే బాగుంటుంది!" అంది.

ఈసారి మేష్టారిదృష్టి ఖాళీ గోడలమీద ఉన్న బూజుల్లోకి దూరింది.

వెంటనే యింకో కొత్త బాల లేచి: "మేష్టారూ! మీ యింట్లో ఉన్న అటువంటి బొమ్మని బడి లోకి పట్టుకువచ్చి గోడమీద వ్రేలాడవేస్తే, మేమంతా బడికి రాగానే దణ్ణం పెడతాము" అని చెప్పింది.

ఆ మాట వినగానే మేష్టారి గుండె దడదడ కొట్టుకోవడం మొదలెట్టింది. ఏంచేత? ఆయనగారింట్లో అటువంటి బొమ్మ అసలు లేదుకనుక.


మేష్టారు ఆపూట తొందరగా బడి మూసేశారు. బాలలంతా యిళ్ళకుపోయి, అన్నాలు తినేసి మేష్టారింటికి బయలు దేరారు. ఆయన యింట్లో ఉన్న భారతమాత బొమ్మనుచూడడానికి బాలలంతా వచ్చేటప్పటికి మేష్టారు కూడా బజారునుంచి అప్పుడే వచ్చేరు. ఆయన చేతులో ఏదో బొమ్మలు చాలా ఉన్నై. బాలలంతా ఆయన దగ్గరకు పరుగెత్తేరు.

మేష్టారు రెండు బొమ్మలు మాత్రం తీసుకొని, మిగిలినవన్నీ బాలలకందరికీ పంచిపెట్టేశారు. ఆ బొమ్మల్లో ఏముంది? భారత మాత!

---

పిల్లలు

మొదట తరువాత



# ఒకే మాట

1. రాముడు ఎవరి సహాయముచే రావణుని చంపెను?

2. విష్ణుదేవుని పట్టణమేది?

3. సభవారిని నవ్వించువాడెవడు?

4. శ్రీరాముడు విరచిన విల్లుఏది?


5 శ్రీకృష్ణుడు ఏయింట నుండెను?

ఈప్రశ్నలకు జవాబులు 5 అక్షరాలుగల ఒక్కొక్కమాటగా వుండాలి. అక్షరాలు ఇటునుంచి ఆటు చదివినా, ఆటునుంచి ఇటుచదివినా ఆమాట అవాలి(జవాబులు ఆగష్టు సంచికలో)

సంపాదన :

ఎ. వెంకటరమణారావు (చిత్తూరు)

# బాలుర బోటు షికారు



చి॥ ఎన్. వెంకటేశ్వర్లు, కస్తూరి, కృష్ణాజీ (గుంటూరు)


# బాల బహుమానాలు

ప్రతీనెలా "బాల" చందాదారుల నెంబర్లు లాటరీతీసి, పదిమంది చందాదారులకు 1 రూ. చొప్పున బహుమానం పంపుతున్నాము. ఈ నెల లాటరీలో యీ దిగువ చందాదారులకు బహుమానములు వచ్చాయి.

మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| 1. డాక్టరు T. సత్యనారాయణమూర్తి (ముందూరు.) | 928 |
| 2. పుప్పల శ్రీరామమూర్తి (అనకాపల్లి) | 48 |
| 3. సెక్రటరీ, కళాసమితి గ్రంథాలయం (అమర్చింత - ఆత్మకూర్) | 763 |
| 4. వై. రాజేశ్వరి, (నాగపూర్) | 819 |
| 5. బి. పురుకుండయ్యశెట్టి & సన్సు (ఆదోని) | 1087 |
| 6. జి. గోపాల్ చెట్టి, (మదరాసు) | 1042 |
| 7. శర్మిష్ఠాదేవి, (వనపర్తిసమస్థానం) | 480 |
| 8. సెక్రెటరీ, జైహింద్ గ్రంథాలయం (వనపర్తిరోడ్డు) | 359 |
| 9. ఎస్. వి. సుబ్రహ్మణ్యం (కోరమాండల్) | 405 |
| 10. వి. సత్యప్రసాద్ బాజ్జీ (కాకినాడ) | 995 |



# బాల్చీలో బాల

రచన: రామాచార్య

బాలా!

బాలలు బలే బలే గమ్మత్తులు చేస్తారు గదూ!

బామ్మ బొబ్బోసుకుందామని బాల్చీతో బొబ్బ పట్టుకొచ్చి, దొడ్లోపెట్టి, అప్పుడే అలా ఒకసారి ఇంట్లోకి వెళ్ళింది.

బామ్మ అలా వెళ్ళడం బాల చూసి, గబగబా పరుగెత్తుకుని ఆ బాల్చీదగ్గిరికి వెళ్ళాడు. అలా వెళ్ళి వూరుకున్నాడా!

అటూ ఇటూ చూసి, ఎవ్వరూ లేరనుకొని చటుక్కున ఆ బాల్చీలోకి దిగాడు.

అలా దిగి వూరుకున్నాడా! 'బుడుగు బుడుగు' అంటూ మునగా, తేలా; మునగా, తేలా.

ఇంతలో వాళ్ళ బామ్మ వచ్చింది.

బామ్మ రావడం చూచి మన 'బాల్చీలో బాల' గబ గబా పరుగెత్తుకొని పారిపోయాడు.

ఎక్కడ కెళ్ళాడో—కనబడ లేదు.

బాల్చీలో బాల దొరికితే బామ్మ బాలలకు బలే బహుమానం ఇస్తుందిట.





# అక్కతో 5 నిమిషాలు

చిట్టిచెల్లాయిలూ !

చిట్టితమ్ముళ్లూ!

అప్పుడే 'బాల' పుట్టి రెండోయేడు పూర్తవుతోంది. వచ్చేనెల ఆగస్టులో 'బాల' పుట్టినరోజుపండుగ చేసుకొని, అందరికీ మిఠాయిసంచిక పంపుతుందట. 150 పేజీలతో, రంగురంగుల బొమ్మలతో, కథలతో ఎంతోబాగుంటుందట మిఠాసంచిక. మీరందరూ తప్పకుండా చదవండేం?

ఇంక ఉత్తరాల్లో విశేషాలేమిటంటే: గుంటూరునుంచి చి॥ పద్మ ఒక ఉత్తరంరాసింది.

"అక్కా! నాకు సినీమా అంటే ఎంతోఇష్టం, కాని, మాఅమ్మా, నాన్న, ఎప్పుడూ నన్ను సినీమాకి తీసుకునేవెళ్లరు.

'చిన్నపిల్లలు సినిమాకు వెళ్లకూడదు' అని అంటారు. ఎంచేత అక్కా; నాకుమాత్రం సరదా కాదూ;" అని రాసింది.

చెల్లాయీ! నిజమే. సినీమా అంటే పెద్దలకు, పిల్లలకు, అందరికీ సరదావే. కాని ఇప్పుడుమనదేశంలో వస్తూన్నఫిల్ముల్లో, ముఖ్యంగా తెలుగు ఫిల్ములు, అరవఫిల్ములు, పిల్లలుచూచి ఆనందించవలసినంత బాగాలేనందున, అమ్మా నాన్నా నిన్ను చూడొద్దన్నారేమో!

మనఫిల్ముల్లోముఖ్యంగా పెద్దవాళ్లకథలూ, వాళ్లకష్టాలు, వాళ్లదుఃఖాలు, వాళ్లనవ్వులూ హాస్యాలూ, ఈసంగతులే వేస్తారుకాని, పిల్లలకు పనికివచ్చేసంగతులేమీ వుండడంలేదు. ఇప్పుడిప్పుడు ఫిల్ముల్లో చిన్నపిల్లల్ని కూడాచేర్చి, ఏదోచిన్నపార్టుఇస్తున్నారు. పిల్లలు నటించిన ఫిల్ములుచూస్తే, పెద్దపెద్ద పేరుపొందిన తారలకంటే

మనబాలలే బాగాచేస్తున్నారనీ, మనబాలలే ఫిల్ముకి ఒక 'కళ' అని తెలుసుకుంటున్నారు పెద్దవాళ్లంతా కాని ఇంకా బాలలకు తగిన ప్రోత్సాహం చూపడంలేదు.

పిల్లలందరిచేతా ఒక సినిమా తీయిస్తే ఎంత బాగుంటుంది! ఇంగ్లండు దేశంలో పిల్లలకని ప్రత్యేకంగా ఫిల్ములుతీస్తున్నారట. వాళ్ల ఆటలు వాళ్లపాటలూ, వాళ్లనాటకాలు ఫిల్ముతీస్తే, ఓపిల్లలకేకాదు, పెద్ద వాళ్లకి కూడా ఆ ఫిల్ములే ఆనందం కలిగిస్తాయి.

ఇప్పుడు రేడియోప్రోగ్రాములుచూడు. పెద్దవాళ్లప్రోగ్రాములకంటే, మనపిల్లల ప్రోగ్రాములే ఎంతో బాగుంటాయని, ఎందరో మెచ్చుకుంటున్నారు. అలాగే ఫిల్ములుకూడా పిల్లలవాతే, పెద్దవాళ్లుకూడా మన బాలఫిల్ములే మెచ్చుకుంటారు. అంచేత బాలలందరూ ఏంచేయాలంటే, మీతలిదండ్రులతో చెప్పండి, ఫిల్ముడైరక్టర్లని కలిసికొని, పిల్లల ఫిల్ములు తప్పక తీయాలి అని హెచ్చరించండి. పెద్దవాళ్లల్లో ఎవరేనాఒకరు ప్రారంభిస్తేచాలు. "తందానతాన" అంటూ, వెంటనే అందరూ మొదలెడతారు. అప్పుడు మన బాలలకు కావలసినన్ని చిత్రవిచిత్రపు ఫిల్ములు వస్తాయి.

ఇప్పుడు అమ్మా నాన్ననిన్ను తీసుకువెళ్లకపోతే పోనీ; మనఫిల్ములువచ్చాక, మనమే వాళ్లనితీసుకువెడదాం. కొంచెం ఓపికపట్టు చెల్లాయి. అమ్మా, నాన్న, వద్దు అంటే నీవుమాత్రం అల్లరి చేయకమ్మా, బాగుండదు. చక్కగా మంచిఫిల్ము ఏదేనావస్తే, వాళ్లేతీసుకువెడతారు. అంతవరకు నీవు ప్రతిరోజుబడికివెడుతూ, చక్కగా ఆడుకుంటూ, ప్రతి ఆదివారం మనపిల్లల రేడియోప్రోగ్రాంవింటూ, వీల్లున్నప్పుడు మీస్నేహితు లందరూకలిసి నాటకాలు, సభలుచేస్తూ ఆనందించండి. ఏమంటావ్, చెల్లాయి?

నీప్రియమైన

అక్క.

# బాలసంఘాలు

## గుత్తి శ్రీబాల విద్యార్థి సంఘం:

జూన్ 8 వ తేదీని గుత్తి దుర్గముపై వార్షికోత్సవం జరిగింది. 20 మంది విద్యార్థులు హాజరైరి. శ్రీ ఆర్ వీరయ్యగారు అధ్యక్షులుగా వున్నారు. శ్రీ భాస్కర బ్రహ్మయ్యగారు, శ్రీ బాలయ్యగారు, శ్రీమతి భాస్కర లక్ష్మీదేవమ్మగారు ఉపన్యసించిరి. డాక్టర్ చక్రాల సీతారామయ్యగారు ఒక శంకరనారాయణ డిక్షనరీ సంఘానికి బహుమతి ఇచ్చారు అని కార్యదర్శి చక్రాల సత్యనారాయణ గారు వ్రాయుచున్నారు.

## ఉప్పుగుండూరు బాల సంఘం:

వేసంగి సెలవుల్లో మా బాల సంఘం బుర్రకధలూ, నాటకాలూ, సభలూ, నృత్య ప్రదర్శనాలు ఎన్నో చేశాం. "బాల జ్యోతి" వ్రాతపత్రిక నడుపుతున్నాం. బడిపంతుళ్ల జీతాలు పెంచాలని కూడా తీర్మానించాం. దె. రాధ.

## కంకిపాడు బాల సంఘం:

జూన్ 20వ తేదిని యీ బాలసంఘం స్థాపించాం. శ్రీ జోశ్యుల సీతారామ సోమయాజులుగారు అధ్యక్షత వహించారు. శ్రీ భమిడిపాటి శ్యామలాంబ, జె. వి. కనకలింగేశ్వరరావు, మద్దూరి కనక దుర్గాంబ కార్యవర్గంలో వున్నారు. 12 గురు సభ్యులు చేరారు.

## సుభాస్ బోస్ బాల సంఘం, వాల్తేరు.

8 వ తేదీని వ్యాసరచనపోటీ జరిపాము. శ్రీ పి. హరినాద్ పట్నాయిక్, వి. కాశీనాద్; పి. ఆర్. శంకరరావుగార్లు బహుమతులు పొందారు. డాక్టరు ప్రకాశరావుగారు యీ సంఘానికి ఎంతో సహాయం చేస్తున్నారు.

## రాజమండ్రీ జయప్రకాష్ పేదవిద్యార్థుల రాత్రి పాఠశాల

ఈ పాఠశాల వార్షికోత్సవం శ్రీ మామిడి అప్పారావుగారి అధ్యక్షతను మే 28 వ తేదీని జరిగింది. పెద్దలు ఉపన్యాసా లిచ్చారు. బాలలు నాటికలు వేశారు.

## కరుణేశ్వరి బాలుర నాట్యమండలి, రాజమండ్రి:

ఈబాల నాట్యమండలివారు బొబ్బిలి, 'కృష్ణతులాభారము', వీరాభిమన్యు మొదలగు నాటకములు వేసి బహుమతులు పొందారు. కార్యదర్శి: బి. సత్యనారాయణరావు

## కోరుమిల్లి భారత బాల సంఘం:

ఈ సంఘం (22బాలికలు 62బాలురు) చాలా వుత్సాహంగా పని చేస్తున్నారు. డాక్టరు బి. హెచ్. శేషగిరి రావుగారు అధ్యక్షతను, శ్రీ శ. రామబాయన్న పంతులుగారు ఆటపాటల పోటీలలో గెలచిన వారికి బహుమతు లిచ్చిరి. కార్యదర్శిని చి|| సాలాది సీతారత్నం.

## రైల్వే విద్యార్థులసంఘం, పలాసా:

"వేసంగి సెలవులు ఎలా గడపడం" అన్న విషయం గురించి పోటీ పరీక్ష జరిగింది. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లులో శ్రీ బి. వి. రాధా రమణగుప్త బాలసంఘం స్థాపించడానికి ప్రయత్నిస్తున్నందులకు సంతోషము.

### తుమ్మలావ బాల సంఘం:

జూన్ 27 వ తేదీని యాళ్ల లోవ రాజుగారి అధ్యక్షతను సభ జరిగింది. శ్రీ ఎ. మాణిక్యాలరావు పి బాబూరావు గార్లు మాట్లాడేరు. వార్షికోత్సవం జూలై రెండవ వారంలో జరుపుటకు, ఆట పాటల పోటీలు జరుపుటకు, బాలబాలిక లందరినీ కనీసం 300 సభ్యులను జేర్చుటకు ప్రభుత్వమువారు ఉచిత నిర్బంధ విద్యా విధానమును అమలు జరిపించ వలెననుచు తీర్మానించడ మైనది.

### విఘ్నేశ్వర సమితి (మద్రాసు)

ఈ సమితి రెండవ వార్షికోత్సవము జూన్ 15 వ తేదీని కె. టి. సి. బాలికా పాఠశాల భవనంలో జయప్రదంగా జరిగింది. అల్పాహారములు, నాటికలు, వ్యాయామ ప్రదర్శనములు, నృత్యప్రదర్శనము బాల బాలికలు అతి ఉత్సాహంతో ప్రదర్శించిరి. సభ జయప్రదంగా జరిగింది.

### శ్రీ సరస్వతీ కళా మండలి (మదరాసు)

ఈ మండలివారు నాట్యశాఖ ప్రారంభోత్సవము జూన్ 22 వ తేదీని జరిపారు. హాస్యనాటికలూ, నృత్యాలూ వినోద ప్రదర్శనాలూ జరిగాయి. బాల బాలికలు జూపిన ఉత్సాహము కొనియాడ దగినది.

## చదువూ—చాకలీ

బాలా!

చదువుతోబాటు చాకలిపద్దుకూడా వేయడం నేర్చుకో.

ఇదుగో మా రవణిగాడు వేసిన చాకలి పద్దు.


దుక్కనాన్నగారి కోటు
చింకి అక్కయ్య పరికిణి
నల్లగళ్లత్త చీర
సిల్కు తమ్ముడు జుబ్బా
మరకల బాబయ్య పంచ
బొంబాయి వదిన చీర
పీచుచెల్లి పరుపు గుడ్డ
జీడిమామయ్య రంగుదుప్పటి
బాలా! ఈ పద్దు సరిగావుందా?
లేకపోతే తప్పులు దిద్దు.

రచన: గుండాల శ్రీనివాసరావు.
(శ్రీకాకుళం)

## ఎవరు పెద్ద?

మా అన్నకంటే నేనే పెద్ద. ఎలాగంటారా? ఇదిగో చెప్తా వినండి. మా అన్న "లా" చదువుతున్నాడు. నేను 'లా' చదివి 'వా' చదువుతున్నాను. అంచేత మా అన్నకంటే నేనే పెద్ద.

రచన: వేమూరి రామేశం. తెణుకు.




[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో ఉపయోగం. మేము ఈ నెల రాజమండ్రి నుండి చి॥ వొంతం శెట్టి వీరభద్రరావు పంపిన డైరీ ప్రచురించాం. చదవండి.–సం॥

లేది.

## జూన్

1 ఇవాళ మా పరీక్ష ఫలితాలు తెలిసేయి. నేను పాసయాను.

2 ఇవాళ మ్యూజియం గార్డెన్ లోకి వెళ్లాను. ఇప్పుడంతా కొత్తగా చేశారు. చాలా బాగుంది.

3 ఇవాళ చంద్రగ్రహణం, పూర్ణిమ కూడాను. ఇవాళ పెద్దచంద్రుడు వచ్చాడు కొంతసేపటికి ముక్కలా అయిపోయాడు. దీనినే చంద్రగ్రహణం అంటారుట.

4 నేను ఇవాళ ఏలూరు వెళ్లాను.

5 ఇవాళ, నా స్నేహితు లందరు కాలువకి వెళుతుంటే నేనూ వెళ్లాను. కాలువ శుభ్రంగా ఎండిపోయింది.

6 ఇవాళే నేను రాజమండ్రి వచ్చేశాను.

7 శెలవుల్లో ఏమీతోచకుండావుంది. ఎప్పుడుబడి పెడతారో!

8 ఇవాళ రేడియో పిల్లల ప్రోగ్రాం విన్నాను. అంట్రిల్లా నాటిక చాలా బాగుంది.

9 మాయింటికి 'బాల' వచ్చింది. అట్టమీదబొమ్మ చాలా బావుంది.

10 ఇవాళ 'బాల' చదివేను, ఎడిటర్ ఎలుకయ్య చదువుతే నాకు బలే నవ్వువచ్చింది,

11 ఇవాళ బొంబాయినుండి టాంకో స్క్రాప్ బుక్కు వచ్చింది.

12 మోటుకథలన్ని ఆ టాంకో స్క్రాప్ బుక్ లోనికి ఎక్కించేశాను.

13 ఇవాళ ఏం తోచడంలేదు. వ్రాయడానికి ఏమీ లేదు.

14 సాయంకాలం గోదావరి దగ్గరకు వెళ్లాను. ఒక మొసలిపిల్లను పట్టేరు.

దాన్నిచూసి నేను భయపడలేదు. ఎందుకూ భయపడడం?

15 ఇవాళ రేడియో పిల్లల ప్రోగ్రాం. ప్రోగ్రాం వినడానికి పక్కింటికి వెళ్లేటప్పటికీ 'పోదామా ఇకపోదామా' అని పాడేస్తున్నారు. అయ్యో! అనిపించింది.

16 ఇవాళ మావీధిలో పిల్లలందరు కలిసి నాటకంవేశారు. నేను మా మామయ్యగారింటికి వెళ్లడంవల్ల, నాటకానికి వెళ్లలేకపోయాను.

17 ఇవాళ మాబడి తెరిచారు. మేం అందరం ఒక అరగంటముందుగానే బడికి వెళ్లేం.

18 ఇవాళ మా మామయ్య మద్రాసు వెళ్లేడు. నేనుకూడా వెడతానని ఏడుస్తే, మాఅమ్మ కోప్పడింది. నాకో రూపాయి ఇచ్చింది. దాచుకున్నాను.

19 ఇవాళ లెక్కల పుస్తకం, జాగ్రఫీ పుస్తకంకొనుక్కున్నాను.

20 ఇవాళ బడిజీతంకట్టేను, 1వ ఫారానికి రు 4-4-0!

21 ఇవాళ స్కూలుకి శెలవు. నాకొత్త పుస్తకాలన్నిటికీ అట్టలు వేసుకున్నాను.

22 ఇవాళ రేడియోప్రోగ్రాం వినడానికి వెళ్లేను. చెంపకాయ నాటిక బలే తమాషాగావుంది.

23 సాయంకాలం టౌన్‌హాలుకి వెళ్లేను. అక్కడ బ్యాట్‌మెంటిన్ ఆడుతున్నారు, నాకుకూడా ఆడాలనివుంది. మా నాన్నగారిని బ్యాట్ కొనమంటాను.

24 ఇవాళ 'బాల'కి ఒక కథ రాసి పంపాను. అదిబాగుందో, లేదో? బాలలో వేస్తారో, వేయరో?

25 ఇవాళ పాతికో తారీఖు అని బళ్లోకు రాసేడు అన్నాడు. అందరూనవ్వేరు.

26 సాయంకాలం మేమందరం గోదావరిబ్రిడ్జిదగ్గరకు వెళ్లేం. రైలు, బ్రిడ్జిమీదనడుస్తుంటే, రేకుమీద నడిచిన శబ్దంవచ్చింది. బలేబాగుంది.

27 ఇవాళ గోదావరికి వెళ్లి స్నానం చేశాను.

28 ఇవాళ మా మామయ్య మద్రాసునుండివచ్చాడు. 'బాల' పాతకాపీలు ఒకసెట్టు నాకోసం తెచ్చాడు.

29 ఇవాళ రేడియోప్రోగ్రాం. కాఫీ హోటల్‌దగ్గర లౌడ్‌స్పీకర్ పెట్టారు ఒకటేశబ్దంవచ్చింది. కానిప్రోగ్రాం బాగా నేవినబడింది.

30 ఇవాళ బడిలో మాక్లాసు టైమ్‌టేబిల్ చెప్పారు. ఇవాళనుంచి నేను పాఠాలు శ్రద్ధగాచదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటాను.




బాలల్లారా!

బహు సంతోషం. క్రిందటినెల పజిల్ చాలా బాగుంది అంటూ చాలామంది రాశారు. ప్రతినెలా బాల పజిల్సు తప్పకుండా మీరు పూర్తిచేసి పంపుతారని నమ్ముతాను.

క్రిందటినెలలో 3,721 బాలలు పజిల్సు పూర్తిచేసిపంపారు. అందులో ఒక్కరు మాత్రమే ఒక్కతప్పైనా లేకుండా పంపారు. 13 మంది ఒక తప్పుతో పంపారు. ఇవిగో వారిపేరు.

తప్పులేకుండా:

ఆరణి రఘునాధరావు (ధవిళేశ్వరం)

ఒక్కతప్పు:

అనాసపురపు ఆచార్యులుపంతులు (విజయనగరం); ఎ.వి.ఎస్. భాస్కరరావు (రాజమండ్రి): కొమ్మూరి సోమనాధాచారి, పి. జనార్ధనశర్మ (తెనాలి); పి. అండాళమ్మ (చోడవరం); జి. ఎల్. నరసింహామూర్తి (కైకారం); ర్యాలి వెంకటసుబ్బారావు (కాకినాడ); వేపా సీతలక్ష్మి (వైజాగ్); తొండాపు రాజారెడ్డి (బిక్కవోలు); డి. ఆర్. కృష్ణప్రసాద్ (పామర్రు); యనమండ్ర నారాయణమూర్తి వల్లభాజోస్యుల అపర్ణ (ఊరిపేరులేదు); ఊరూ పేరూ లేకుండా ఇంకోచదరం.

బాల వినోదపజిల్ 1 సరియైన చదరం,


| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 బా | 2 ల | ■ | 3 పా | ము | ■ |
| బు | క్క | ■ | 4 పి | ల | 5 క |
| ■ | ■ | 6 కో | ■ | ■ | ని |
| 7 ఆ | ■ | 8 ప | శ్శు | ■ | గి |
| 9 క | త్స్య | ము | ■ | 10 క | రి |
| వి | ■ | ■ | 11 గు | ద్దు | ■ |

ఇదిగో

- మీరు, 'బాల' లోని చదరాన్ని కత్తిరించి, పూర్తిచేసి పంపాలి.
- మీ పూర్తి యడ్రసు, పేరు చదరం పక్కని రాయాలి.
- చదరం : "పజిలన్నయ్య," 'బాల,' 3, తంబుచెట్టి వీధి, మద్రాసు 1 కి పంపాలి.

# బాలవినోద పజిల్-2

చదరం



## సూచనలు

### అడ్డంవరుస

1. 'బాల'లో ఇవి వుంటాయి.
3. ఆడది
4. ఇతరుల ఇవి ముట్టకూడదు.
5. పుస్తకానకి ఇది అవసరం.
6. దీని మేనమామ చాలా ఇళ్లల్లో వుంటాడు.
9. ఇది ఆడకూడదు.
11. లోభి
12. అప్పుచేస్తే ఇది సుమా!

### నిలువు వరుస

1. దీనినిండా అన్నంతిను
2. ఈ పిల్లల్లో అందమైన వారున్నారో సుమా!
7. కొన్ని ఇవి విశ్వాసముగలవే.
8. —వాడికి పాలే ఆధారం.
9. మిక్కిలి
10. ఇంట్లో వుంటుంది కాని వంటింట్లో వుండదు.

# కొత్త పత్రికలు

## సచిత్ర

ఇది మాస పత్రిక. 'బాల' సైజులో 50 పేజీలు, విడి ప్రతి పావలా. సం|| చందా రూ 3-8-0. సంఘాన్ని బాగుపరచాలనే కోరికతో వివిధ రచనలు ప్రచురిస్తోంది. చలం, ఆరుద్ర, కొడవటిగంటి శ్రీశ్రీ మొదలగు వారిరచనలున్నాయి. పిల్లల కథకూడా ఒకటుంది. మొదటి సంచిక బాగుంది. ఇలాగే అన్ని సంచికలూ వుండాలని కోరుతున్నాం. సంపాదకుడు: డి. సోమసుందరరావు. దొరకుచోటు, 6, మేయర్ బాసుదేవ్ వీధి, మదరాసు 21.

## కలిమాయ

"బాల" సైజులోనే ఇది ఒక మాస పత్రిక. మనం వున్నది కలికాలం. ఈకలికాలంలో అంతా మాయగా వుంది. ఆ మాయమూలాన్ని మనసంఘం చెడిపోతోంది. అటువంటి చెడుగు యీ 'కలిమాయ' ద్వారా పోగొట్టాలని ఆశయం. సంపాదకురాలు: శ్రీమతి బి. సావిత్రీదేవి. చందాసాలుకు రూ 3. 8-0 విడిప్రతి పావలా. దొరకుచోటు: 17 A కుట్టిశెట్టి వీధి మద్రాసు 7.

## "అమరజ్యోతి"

తెనుగు సచిత్ర వారపత్రిక. సంపాదకులు: గ్రంథే రఘురామగుప్త. కర్నూలు నుంచి ప్రతిశనివారం వెలువడుతుంది. వెల అణాన్నర. సం|| చందా రూ 5.

## నవయుగం.

ఇది నెల్లూరునుంచి, శ్రీ జి.జె. రావ్, బి.గుప్తగారి సంపాదకత్వమున ప్రచురింపబడుతున్న వారపత్రిక. వెల 0-1-6 వారపత్రిక గనుక ఇంకా మంచి శీర్షికలతో, చక్కగా ముమ్ముందు రాగలదని ఆశిస్తున్నాం.

## కథాంజలి

కథాంజలి వార్షిక సంచిక అందింది. 130 పేజీలలో, కథలు ప్రత్యేకరచనలు, ఆర్టు కాగితంపై చక్కని చిత్రాలూ, అందరి అభిరుచులకు తగినట్లుగా వ్యాసాలూ అవీ - అందంగా వుంది సంచిక. వెల 1 రూ. కావలసినవారు కథాంజలి ఆఫీసు, 32, క్రిష్ణప్పనాయర్ గుంటవీథి; మదరాసు అని రాయండి.

# రహస్యం!

చెన్నపట్నంలో తెలుగు వారి అమ్మాయిలూ! అబ్బాయిలూ! ఒక్క మాట అడుగుతాను, చెప్తారా?

నీవు చదువుకుంటున్నావు గదా? ఏస్కూలులో? నీకు పాఠాలు తెలుగులో చెప్తారా, అరవంలో చెప్తారా? అరవంలో అయితే ఏమి? ఎందుచేత? పుట్టినప్పటినుంచీ ఇంట్లో అమ్మా, నాన్నతో తెలుగే మాట్లాడుతావు. మీ అమ్మమ్మచేత తెలుగులోనే కథలు చెప్పించుకుంటావు. మరి చదువు అరవంలో ఎందుకు చదువుతావు? మీబడిలో తెలుగులో చెప్పరూ? అది ఏబడి? ఏ పేటలో వున్నది?

'బాల' పత్రికకు యీ సంగతులన్నీ వ్రాయి. నాకు తెలుస్తుంది. మీబడిలో తెలుగు చెప్తే, ఇతర తెలుగు పిల్లలు కూడా మీబడికివచ్చి, నీతో పాటు తెలుగులో చదువుకుంటారు, ఆటలాడుతారు, పాటలు పాడుతారు.

వెంకటప్ప.



మేష్టారు: ఇదేమిట్రా! ఈబొమ్మ!
కుర్రాడు: పోలికలు మేష్టారూ!

# గ్రహణాలు

బాలా!

మనకి రెండు గ్రహణాలగురించే తెలుసు. అవి సూర్యగ్రహణం చంద్ర గ్రహణం.

గ్రహణంఅంటే పట్టడం అన్న మాట. గ్రహణం సూర్యుడినిగాని, చంద్రుడినిగాని పట్టి, వదిలేస్తుంది.

కాని, ఇంకొక గ్రహణంకూడా వుంది. అది పట్టిందంటే ఇక వదలదు. అది అందరికీ పట్టుతుంది. నీకుకూడా పట్టవచ్చును. అది ఏమిటో తెలుసా? పాణిగ్రహణము! అంటే పెళ్లి అన్నమాట.

రచన: లీలాశంకర్ (రేపల్లె).



# బాల పోటీ- -గెలిచినవారు

జూన్ నెల "బాల"లోని బాలపోటీ పరిక్షలో చాల మంది రచనలు పంపారు. ఈదిగువ వారికి బహుమానములు నిశ్చయించడ మయింది—సం॥]

మొదటి బహుమానం (రూ॥ 10)

చి॥ ఖాసునివీసు మాణిక్యాంబ (జామ్‌షెడ్‌పూరు)

రెండవ బహుమానం (రూ॥ 6)

చి॥ నిడదవోలు సర్వేశ్వరావు (మదరాసు)

మూడవ బహుమానం (రూ॥ 4)

చి॥ పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ)

వీరికేగాక - ఈదిగువ ఇరువురికీ ప్రత్యేక బహుమానములు పంపబడును.

1. చి॥ నెమలి మాలతి (పుగలూరు)
2. ,, వల్లూరి సావిత్రి (మదరాసు)

## బహు మానములు జులై 10 తేదీని పంపబడును.

**తెలుసా**

ఒక కాకి చనిపోతే, మిగిలిన కాకులన్నీ కలిసి నీటిలో మునిగి స్నానం చేస్తాయిట! నేను గోదావరీ నదిలో యీగమ్మత్తు చూచాను.

పి. రామచంద్రరావు.

# ★ "బాల" పోటీపరీక్ష ★

జూలై నెల పోటీ

| | |
|---|---|
| మొదటి బహుమానం | రూ. 10 |
| రెండవ బహుమానం | రూ. 6 |
| మూడవ బహుమానం | రూ. 4 |

పిల్లలకు గొప్ప అవకాశం! ఉత్సాహం! ఆనందం!

ఈనెల పోటీ ప్రశ్న ఇది:

## బాలురు: "నేనే రాజునైతే"

## బాలికలు: "నేనే రాణినైతే"

బాలా! నువ్వు రాజు లేక రాణివైతే ఏంచేస్తావో రెండు పేజీలకు మించకుండా (పావుతావుసైజులో) రాయవలెను. నీవు బాగా రాస్తే నీకు యీపై మూడు బహుమానాలలో ఒకటి రావచ్చును.

## మీ రచనతో 4 అణాలు పంపండి

★ నాలుగణాలు మనియార్డరుగాని, నాలుగు అణాబిళ్లలుగాని పంపండి. పావలా బిళ్లలు పంపవద్దు.

★ ఈ పోటీలో 15 ఏళ్లకు లోపువారే చేరాలి.

★ కవరుమీద "బాల పోటీ" అని పెద్ద అక్షరాలతో రాయాలి.

★ మీ రచనలు మాకు జూలై 25 తేది లోపుగా చేరాలి.

ఈ పోటీలో 'బాల' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.

ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

పై విలాసం ఇలా రాయండి:

"బాల పోటీ పరీక్ష"

c/o "బాల" 3, తంబుశెట్టి వీధి, మదరాసు 1.



# రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[211 మీటర్లు, 31,36 మీటర్లమీదా వినవచ్చు.]

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

### జూలై

**13-వ తేదీ ఆదివారం:**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలసంచీ; బంగారు బొమ్మ (నాటిక;) పుట్టిం రోజులు; పూలపల్లకీ (పాటకథ;) కథలూ కబుర్లూ అవీ; చిక్కుప్రశ్న; పోదామా.

**20-వ తేదీ ఆదివారం:**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలసంచీ; తమాపాల గుత్తి, ఇంద్ర ధనస్సు-సంగీత నాటిక; పుట్టింరోజులు; తాతయ్యకథ; చిట్టిపాటలు; చిక్కుప్రశ్న; పోదామా.

**27-వ తేదీ ఆదివారం:**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలసంచీ; మంచిభూతం (నాటిక;) పుట్టింరోజులు; పొట్టిబావకథ; పాటలూ అవీ; చిక్కుప్రశ్న; పోదామా.

### ఆగస్టు

**3-వ తేదీ ఆదివారం:**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలసంచీ; ఆంధ్రబాలిక - నాటిక; పుట్టింరోజులు; సాలీడు (పాటకథ;) కథలూ కబుర్లూ; పోదామా.

పొడుపుకథలు: జూన్ నెలలోని పొడుపుకథలకు జవాబులు:

1. బియ్యపుబస్తా; 2. దేశపటము; 3. సాన 4. రోడ్డు; రైలుపట్టాలు; 5. లవంగమొగ్గ; ఉసిరికాయ, విభూతిపండు.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by Dr. S. Seshagiri Rao at the Lodhra Press, Kesari Kuteeram Ltd., 15, Westcott Road, Royapettah, Madras-14.

# అమృతాంజనము

అమృతాంజనము వాడవేమి ?
నీవు - ఆదివ్యాధుల బాయవేమి ;

1 ప్రతిషాపునందది, సులభముగ చిక్కును
ఎటువంటినొప్పిని త్రుటిలోన నొక్కును
మితమైన వెలయనుచు మిగులపేరెక్కును
తత్ఖ్యాతితోడ సంతతము అదిచొక్కును ॥అమృ॥

2 తలనొప్పి దానివాసననుగొని తొలగును
కీళ్లనొప్పులు దానికి వెఱగితొలగును
పడిశములు దానిసంపర్కమున బఱచును
జలుబు రొంపలు దానిచాయగని వెఱచును ॥అమృ॥

3 ఆరోగ్యమునతేరి ఐశ్వర్యమునమీరి,
దేశీయ జాతీయ స్వాతంత్ర్యమునుగోరి,
పోరాడుచుండు వీరులకు, ఉద్యోగులకు,
కూరిమిని గూర్చగల సారమని తెలిసికొని ॥అమృ॥

4 అమృతాంజనం బవసరములేని దేహంబు
జగతిలో లేదనుచు చాటుప్రతిగేహంబు
విడువుమయ్యా ఇంక వెఱగు సందేహంబు,
తడబడకపిదప సంగ్రహముంచు వేగంబు ॥ అమృ ॥

గరిమెళ్ల సత్యనారాయణ బి. ఏ.

# బాల మిఠాయి సంచి

ఆగస్టు మొదటివారంలో వస్తోంది!

బాలా!

ఆగస్టులో 'బాల'కు పుట్టినరోజు.

అంచేత, మన 'బాల' ప్రత్యేక మిఠాయి సంచిక

—తయారవుతోంది. అందులో—

చిట్టిబాల కథలూ; చిన్నబాల కథలూ;
పెద్దబాల కథలూ; పొట్టిబావ కథలూ;
ఆటలూ, పాటలూ, నాటికలూ;
గొలుసుమాటలూ, మెలికమాటలూ;
వింతలూ, వినోదాలూ, విచిత్రాలూ;
హాస్య చిత్రాలూ; హాస్యరచనలూ;
ప్రశ్నలూ, పోటీలు, పజిల్సూ;

అవీ, ఇవీ, అన్నీ వుంటాయి.

వెల 1 రూ॥ మాత్రమే! చందాదారులకు ఉచితం

రిజిష్టరు పోస్టు 0-3-0 ప్రత్యేకం

వెంటనే మీవూరి ఏజంటుతో చెప్పండి.

లేదా

చందాదారులుగా చేరండి.

సాలుకి చందా రూ 5 లు మాత్రమే.

మేనేజరు: 'బాల,' 3, తంబుచెట్టి వీధి, మదరాసు

PRINTED AT THE LODHRA PRESS, 15, WEST COTT ROAD, ROYAPETTAH, MADRAS